# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 236 | హైదరాబాద్ | గురువారం 12-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

మధ్య ప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధం: బాగ్దాద్ విమానాశ్రయంపై డ్రోన్ దాడి

# వెలుగుమట్లలో
# మోడల్ కాలనీ నిర్మిస్తాం

- రేపటి నుంచే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి
- డిసెంబర్ 9న సీఎం చేతుల మీదుగా గృహ ప్రవేశం
- నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22,500 కోట్లు మంజూరు
- వెలుగుమట్ల పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



11లో



## భాగ్యలక్ష్మి దోపిడీ?

- నిజనిర్ధారణకు వెళ్తే అడ్డుకుంటారా? బీఆర్ఎస్ నేతల మండిపాటు

12లో



## లోక్‌సభ స్పీకర్‌కు ఊరట..

11లో

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తిరస్కరణ
- మూజువాణి ఓటుతో వీగిపోయిన ప్రతిపక్షాల తీర్మానం
- చర్చలో రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- చైర్‌లో కూర్చోకుండా కొత్త సంప్రదాయానికి తెరతీసిన ఓం బిర్లా
- స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న విపక్షాల వ్యూహం విఫలం

### వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం...
## కేంద్రం కీలక ప్రకటన

- వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్న కేంద్రం
- ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఆదేశం
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి అవుతోందన్న కేంద్రం

11లో






## ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు..
### ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన

- రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి
- ముందు విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం..

11లో



## అధికారంలోకి వచ్చాక అదృశ్యం..

- అధికారం చేపట్టిన నాటి నుంచి కనిపించని ఇరాన్ కొత్త అధినేత మొజ్తబా
- యుద్ధంలో గాయపడినట్లు అంగీకరించిన ఇరాన్ ప్రభుత్వ మీడియా
- పాత ఫొటోలు, ఏఐ చిత్రాలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ ఛానళ్లు

11లో

## గండం గట్టెక్కినట్టేనా?

- ఫిరాయింపుల కేసులో స్పీకర్ 'క్లీన్ చిట్'
- దానం, కడియంల అనర్హత పిటిషన్ల కొట్టివేత
- సాంకేతికంగా వారు బీఆర్ఎస్ సభ్యులేనన్న స్పీకర్
- సుప్రీంకోర్టు విచారణకు ఒకరోజు ముందే సంచలన నిర్ణయం

హైదరాబాద్, మార్చి 11: భారత శక్తి:తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా అత్యంత ఉత్కంఠ రేపుతున్న 'పార్టీ ఫిరాయింపుల' అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక ఘట్టానికి చేరుకుంది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం సంచలన తీర్పును వెలువరించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్

తరువాయి 12లో



### పారిశుధ్య 'పడగనీడ'లో
## కార్మికుల బతుకులు!

- పారిశుధ్య 'పడగనీడ'లో కార్మికుల బతుకులు!
- క్షేత్రస్థాయి వాస్తవాలపై సర్కారుకు అవగాహన శూన్యం.
- పీఎఫ్, ఈఎస్ఐ ఊసే లేదు.. రక్షణ కవచాల్లేక రోగాల పాలు..
- సీఎం రేవంత్ తీరుపై సబితా ఇంద్రారెడ్డి నిప్పులు.. 'భారత శక్తి' ప్రత్యేక కథనం

12లో



భారత శక్తి

# జెన్ జీ పైనే ఆశలన్నీ...

సౌత్ ఏషియాలో ఓ శక్తివంతమైన కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావాన్ని చూస్తోం ది. జనరేషన్ జెన్ అనే యువతరంగం. విరామం లేని, డిజిటల్‌గా మమేకమై, అసహన తరం. స్మార్ట్ ఫోన్‌లు, సోషల్‌మీడియా, గ్లోబల్ కనెక్టివిటీ యుగంలో ఆవిర్భవించిన ఈ తరం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన రాజకీయ స్తబ్దత, అవినీతి, వంశపారంపర్య అధికార వ్యవస్థలను అంగీకరించడానికి సిద్ధంగా లేదు. నేపాల్‌లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఈ తరం మార్పునకు ఓ అద్భుతమైన ఉదాహరణ. బాలేంద్ర షా విజయం, యువత నడిపే రాజకీయ ఉద్యమం విస్తరణ నేపాల్ సాంప్రదాయ రాజకీయ వ్యవస్థను కూల్చివేసింది. అదే సమయంలో, బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ప్రయోగం నిరసనలను రాజకీయ శక్తిగా మరల్చడంలో విఫలమైంది. నేపాల్‌కు విరుద్ధమైన కథ ఇది. ఈ కథనాలు పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. జనరేషన్ జెన్ భారతదేశంతో సహా దక్షిణాసియా అంతటా రాజకీయాలను పునర్నిర్మించగలదా. నేపాల్‌లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఓ రాజకీయ భూకంపం వంటివే. దశాబ్దాలుగా నేపాల్ రాజకీయం సాంప్రదాయ పార్టీలు, అనుభవజ్ఞులైన నాయకుల ఆధిపత్యంలో సాగేవి. నేపాలీ కాంగ్రెస్ వర్గాలు, కె.పి.శర్మ ఓలి వంటి ప్రముఖుల నేతృత్వంలో కమ్యూనిస్ట్ గ్రూప్‌ల మధ్య రాజకీయ అధికారం ఊగిసలాడింది. 2008లో రాచరిక వ్యవస్థ రద్దయి గణతంత్ర రాజ్యాంగం ఆమోదం పొందినా, వ్యవస్థ మారలేదు నేపాల్ లో రాజకీయ వ్యవస్థ ఒక ఉన్నత వర్గం నుంచి మరో ఉన్నత వర్గానికి బదలీ అయిందని చాలామంది నేపాలీ పౌరులు భావించారు. అవినీతి, కుంభకోణాలు, వర్గపోరు, దీర్ఘకాలిక అస్థిరత ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న యువ నేపాలీల నిరాశ నిస్పృ?పహలు తారస్థాయికి చేరాయి. నేపాల్‌లో జనరేషన్ జెన్ కొత్త తరహా రాజకీయాలను కోరింది- పారదర్శకంగా, జవాబుదారీగా, దేశపాలనను నియంత్రించిన పాలకులనుంచి విముక్తి పొందింది. ఇందుకు సోషల్ మీడియా ప్రధాన సాధనంగా మారింది. కార్యకర్తలు నిరసనలు నిర్వహణకు, సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి, రాజకీయ సంకేతాలను అనూహ్యమైన వేగంతో సమన్వయం చేయడంలో వీలు కల్పించింది. డిజిటల్ లాండ్ స్కేప్ నేపాలి యువతలో కొత్తరాజకీయ చైతన్యాన్ని సృష్టించడంలో కీలకం అయింది. పట్టణాలలోని కార్యకర్తలు, విద్యార్థులు, యువ నిపుణులను శక్తివంతమైన సమష్టి శక్తిగా ఏకంచేసింది. ఈ పరిణమాలనుంచి బాలేంద్ర షా అనే యువ తరంగం ఉద్భవించాడు. అందరూ బాలెన్ అని పిలిచే, రాపర్, ఇంజనీర్, ఆతర్వాత కాలంలో ఖాట్మండు మేయర్ అయిన బాలేంద్ర షా, సాంప్రదాయ రాజకీయ తరగతికి పూర్తి భిన్నంగా ప్రాతినిధ్యం వ్యవహరించాడు. యువకుడు, నిష్కపటంగా మాట్లాడేవాడు కావడం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అతడు నేపాల్ పట్టణ యువత ఆకాంక్షలను నేరుగా తీర్చాడు. అతడి ఆవిర్భావం దశాబ్దాలుగా నేపాల్‌పై ఆధిపత్యం సాగించిన పాత రాజకీయ సంస్కృ?కతి నీరుగారిపోయింది. బాలెన్ షా రాజకీయ విజయం యాదృచ్ఛికం కాదు. అతడి ప్రచారం యువత నిరసన శక్తిని సమర్థంగా ఉపయోగించుకుంది. దానిని ఒక వ్యవస్థీకృత ఎన్నికల ఉద్యమంగా మార్చింది. సోషల్ మీడియా కీలక పాత్ర, అట్టడుగు వర్గాల సమీకరణ, సుపరిపాలన, అవినీతి నిరోధక సంస్కరణలతో కేంద్రీకృతమైన సందేశంతో బాలేంద్ర షా, అతని మిత్రులు నేపాల్‌లో రాజకీయ పార్టీలకు దీటైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలో విజయం సాధించారు. నేపాల్ ఎన్నికల ఫలితాలు సాంప్రదాయ రాజకీయ ఉన్నత వర్గాలపట్ల ప్రజల సంతృప్తిని ఎత్తిచూపాయి. దశాబ్దాలలో మొదటిసారిగా, నేపాల్ ప్రధాన పార్టీల దీర్ఘకాలిక ఆధిపత్యం, యువత క్రియాశీలతతో తలెత్తిన కొత్త రాజకీయశక్తినుంచి తీవ్రమైన సవాలు ఎదుర్కొంది. షా విజయం ఒకప్పుడు నిరసనల ద్వారా తమ కోపాన్ని వ్యక్తం చేసిన తరం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. బిఎన్‌పి పునరాగమనం, ప్రభుత్వ మార్పును సూచిస్తున్నా, యువత ఆశించిన పరివర్తనను అది పాదుకొల్పలేదు. బంగ్లాదేశ్ అనుభవం నిరసన ఉద్యమాలను స్థిరమైన రాజకీయ సంస్థలను మార్చడంలో ఎదురయ్యే ఇబ్బందులను చెప్పక చెబుతోంది. నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఎదురైన విభిన్నమైన ఫలితాలు, యువత రాజకీయాల గురించి ఓ ప్రాథమిక సత్యాన్ని వివరిస్తాయి. సామూహిక నిరసనలు, రాజకీయ వ్యవస్థలను సవాల్ చేయగలవు కానీ, మార్చలేవు. విశ్వసనీయమైన నాయకత్వం, స్పష్టమైన దృక్పథం, ఎజెండాతో నిసనలు రాజకీయ ఉద్యమాలుగా పరిణామం చెందకపోతే, ఉన్న వ్యవస్థ స్థానే కొత్త వ్యవస్థను నిర్మించలేవు. నేపాల్‌లోని జనరేషన్ జెడ్ తిరుగుబాటు యువతశక్తిని ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశపెట్టగల నాయకుడిని తయారు చేయడం వల్లే విజయవంతం అయ్యాయి. అతి పెద్ద దేశం, ఎన్నో రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు లోతైన సంస్థాగత నెట్ వర్క్, ఆర్థిక వనరులు కలిగి ఉంటాయి. అవి కొత్త ఉద్యమాలను కష్టతరం చేస్తాయి. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలకు విస్తృత స్థాయిలో అట్టడుగు స్థాయినుంచి సమీకరణ, సంస్థాగతంగా సంకీర్ణపరమైన నిర్మాణం అవసరం. ఇంకా కులం, మతం, భాష, ప్రాంతీయ గుర్తింపులతో కూడిన విస్తృతమైన సామాజిక వైవిధ్యం, తరచు రాజకీయ సమీకరణలను విచ్ఛిన్నం చేస్తుంది. యువత క్రియాశీలత జాతీయ దృష్టిని ఆకర్షించినా, ఆ శక్తి ఏకీకృత రాజకీయ ఉద్యమంగా మార్చడం సవాల్‌గా మిగిలిపోతుంది. అయినా, భారతదేశంలో జనరేషన్ - జెడ్ రాజకీయ తరంగాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లు నిర్మాణాత్మక ఎన్నికల కూటమిగా మారుతున్నారు. రాజకీయ పార్టీలు, తమ అజెండాలు, నాయకత్వాలను నిర్మించడంలో యువ ఓటర్ల డిమాండ్లను ప్రతిబింబించేలా మార్చుకోవచ్చు. డిజిటల్ సమీకరణతో అట్టడుకు స్థాయి యువత ఆధారిత ఉద్యమం ఉద్భవిస్తే, భారతదేశ రాజకీయ దృశ్యం సమర్థవంతంగా పునర్నాిణం కాదలదు.

# లిక్కర్ స్కాంలో ఆస్తుల అటాచ్

విజయవాడ, మార్చి 11, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ లో ఈడీ దూకుడు పెంచింది. మాజీ సీఎం జగన్ తరపున పనులు చక్కబెట్టారన్న ఆరోపణలున్న



వారిని ఈడీ పిలిచి ప్రశ్నిస్తోంది. ఇప్పటికే వెయ్యి కోట్ల మనీలాండరింగ్ ను గుర్తించినట్లుగా చెప్పి నాలుగు వందల కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసింది. సిట్ దర్యాప్తుపై వైసీపీ తీవ్ర విమర్శలుచేసింది. అసలు మద్యం స్కామే లేదని అంతా సృష్టిస్తున్నారని ఆరోపించింది. కానీ ఈడీ దర్యాప్తుపై మాత్రం నోరు మెదపడం లేదు. ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఆంధ్రప్రదేశ్ మద్యం స్కాంలో జరిగిన సుమారు రూ. 4,000 కోట్ల కుంభకోణం కేసులో ఈడీ తన పట్టును బిగిస్తోంది. ఏకంగా రూ. 441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. ఇందులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, వాసుదేవరెడ్డి వంటి వారి స్థిరాస్తులు, బ్యాంక్ నిల్వలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు రూ. 1,048 కోట్ల మేర ముడుపులు చేతులు మారినట్లు ఈడీ నిర్ధారించింది. మద్యం తయారీదారుల నుంచి బలవంతంగా నగదు, బంగారం వసూలు చేశారని, ఆ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని దర్యాప్తు సంస్థ గట్టి ఆధారాలు సేకరించింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేపట్టినప్పుడు వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా స్పందించాయి. అదంతా రాజకీయ కక్ష సాధింపు అని, టీడీపీ ప్రభుత్వం కావాలనే అబద్ధపు కేసులు సృష్టిస్తోందని ఆరోపించాయి. కానీ, ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి ఆస్తులను జప్తు చేస్తున్నా, నోటీసులు జారీ చేస్తున్నా వైఎస్సార్సీపీ అగ్రనాయకత్వం నుంచి ఆ స్థాయిలో ఖండనలు రావడం లేదు. సిట్‌ను విమర్శించినట్లుగా ఈడీని విమర్శించలేకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం , భయం దాగి ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీని నేరుగా టార్గెట్ చేస్తే అది ఢిల్లీ స్థాయిలో రివర్స్ అవుతుందనే ఆందోళన వైఎస్సార్సీపీలో కనిపిస్తోందని చెబుతున్నారు. అందుకే సిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విభాగంగా ముద్ర వేసి తిట్టగలిగిన వారు, ఈడీ దగ్గరకు వచ్చేసరికి మౌనంగా ఉండిపోతున్నారు. ఈడీ తన దర్యాప్తులో మనీ లాండరింగ్ ఆధారాలతో చర్యలు తీసుకోవడం వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం రాజకీయ ఆరోపణలైతే ప్రజల్లో సానుభూతి పొందవచ్చు, కానీ వందల కోట్ల ఆస్తులను జప్తు చేయడం, నగదు లావాదేవీలను సాక్ష్యాలతో సహా చూపడం వంటివి ప్రజల్లో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయి. ఈ స్కామ్‌లో ఇప్పటికే జగన్ కు అత్యంత సన్నిహితులుగా వ్యవహరించిన వారిని పిలిచి ప్రశ్నించారు ఈడీ అధికారులు. ఐదేళ్ల పాటు వైసీపీ హయాంలో పూర్తి స్థాయిలో చక్రం తిప్పిన మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ వ్యక్తిగత పీఏ కృష్ణమోహన్ రెడ్డి వంటి వారిని పిలిపించి.. గత పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లను తీసుకున్నారు. అలాగే జగన్‌కు మరో అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కోర్టు అనుమతితో విచారించి కీలక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ప్రస్తుతం ఇతర అధికారులకు, రాజకీయ అనుచరులకు నోటీసులు వెళ్తున్నాయి. ఈ అంశంపై విమర్శలు గుప్పించడం కన్నా. ..సైలెంట్ గా ఉండటమే మంచిదని వైసీపీ భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

# ఎన్డీయేకు జై కొట్టిన జగన్

విజయవాడ, మార్చి 11,



జాతీయస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చకు వచ్చింది. ఆ పార్టీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. జాతీయస్థాయిలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇండియా కూటమి అంతా ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ సైతం తమ మద్దతు పై ప్రకటన చేసింది. దీనిపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. ప్రభుత్వ సమాధానం తర్వాత ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇస్తుందా? వ్యతిరేకిస్తుందా అనేది హాట్ టాపిక్. ఒక విధంగా ఇది ఆ పార్టీకి సంక్లిష్ట సమస్య. అవిశ్వాసానికి మద్దతు ఇస్తే బిజెపి ఆగ్రహానికి గురికాక తప్పదు. ఒకవేళ వ్యతిరేకిస్తే మాత్రం జాతీయస్థాయిలో ఆ పార్టీకి స్నేహితులు అనేవారు కరువు అవుతారు.వైసీపీ నిర్ణయంపై హార్ట్ డిస్కషన్.. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి 21 మంది కూటమి ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఎన్డీఏ కు మద్దతుగా ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కచ్చితంగా వీరు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి. పోనీ తెలంగాణలో కెసిఆర్ పార్టీకి ఎంపీలు ఉన్నారా అంటే లేరు. దీంతో ఆ పార్టీకి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేవు. 17 మంది ఎంపీలకు గాను చెరి సగం ఎంపీలు కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పంచుకున్నాయి. ఎంఐఎం కు ఒక్క ఎంపీ ఉన్నారు. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ఏంటి అనేది హాట్ టాపిక్.గతంలో ఉపరాష్ట్రపతి త పాటు స్పీకర్ ఎన్నికల సమయంలో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తాజాగా జగన్మోహన్ రెడ్డి తన పాత కేసుల విషయంలో బెంగళూరు వేదికగా కీలక చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. మద్యం కుంభకోణం, వివేకానంద రెడ్డి హత్య కేసు, జగన్ పై ఉన్న పాట కేసులు తెరపైకి వస్తున్న నేపథ్యంలో.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా ఎన్డీఏకు మద్దతుగా నిలుస్తారన్న వారే అధికం. పార్టీ ఎంపీలతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. సూత్రప్రాయంగా ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు ఒక నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఒకవైపు బిజెపి భాగస్వామిగా ఉన్న కూటమికి వ్యతిరేకంగా ఉంటూనే.. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న ఎన్డీఏకు జగన్మోహన్ రెడ్డి మద్దతు తెలపడం మాత్రం జాతీయస్థాయిలో హాట్ టాపిక్ అవుతోంది. ఇది ఆ పార్టీకి ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# పరకామణి అక్రమాలపై సిఐడి, ఏసీబీ విచారణ జరపాలి: భూమన

తిరుపతి మార్చి 11,

టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమల పరకామణి లెక్కింపులో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2024 అక్టోబర్ 6న సీనియర్ అసిస్టెంట్ ఎస్. కృష్ణ కుమార్ పరకామణి రిజిస్టర్లో డబ్బుల నమోదులో అక్రమాలకు పాల్పడ్డాడు. సుమారు 950 విదేశీ కరెన్సీ నోట్లను (100 డాలర్లు) తక్కువ విలువగా చూపించి టీటీడీకి అప్పగించాడు. అసలు విలువ సుమారు రూ.87.21 లక్షలు కాగా, ఎఫ్ఐఆర్లో రూ.6.74 లక్షల దుర్వినియోగం మాత్రమే చూపించారని అన్నారు. అక్టోబర్లో జరిగిన ఘటనపై 2025 మార్చి 14న మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు కావడం విడ్డూరమని అన్నారు. ఈ ఆలస్యంతో నిందితుడు అరెస్టు కాకుండా సుప్రీం కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందాడు. పరకామణి ఉద్యోగి పెంచలయ్యపై 24 సార్లు బంగారం దొంగతనం ఆరోపణలు ఉన్నప్పటికీ కఠిన చర్యలు లేవు. అతని వద్ద 555 గ్రాముల బంగారం, 117 గ్రాముల వెండి దొరికినట్లు సమాచారం. గతంలో రవి కుమార్ 800 డాలర్ల దొంగతనం కేసులో పెద్ద వివాదం చేశారు. తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా రవి కుమార్ రూ.100 కోట్ల విలువైన ఆస్తులు టీటీడీకి రాసిచ్చాడు . ప్రస్తుతం జరుగుతున్న పెద్ద ఎత్తున అవినీతిపై ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందనేది నా ప్రశ్న. బి.ఆర్. నాయుడు నేతృత్వంలోని టీటీడీ పాలకమండలి శ్రీవారి ఆభరణాలు, కానుకలకు రక్షణ కల్పించడంలో విఫలమైంది . తిరుమలలో భక్తుల మరణాలు, గోమాతల మరణాలు, నెయ్యి కొరత తీవ్ర ఆవేదనకు గురి చేస్తుంది పరకామణిలో జరుగుతున్న అక్రమాలపై సిఐడి, ఏసీబీ తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు..

# కేడర్ లో అసంతృప్తి..

కాకినాడ, మార్చి 11

జనసేన పార్టీఆవిర్భావ దినోత్సవం అంటే ఆ పార్టీ కేడర్‌కు ఒక పండగ. అణచివేతను ఎదిరించి, ప్రశ్నించే గొంతుకగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఈసారి పిఠాపురం



వేదికగా జరిగే వేడుకలు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తాయని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా పార్టీ అధిష్టానం ఈ వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జనసైనికులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది.రాష్ట్ర రాజకీయాల్లో జనసేన గ్రాఫ్ పెరుగుతున్న తరుణంలో, ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన పార్టీ ఆవిర్భావ సభ రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఈ సభ పార్టీ బలోపేతానికి ఒక దిక్సూచిలా మారుతుందని కేడర్ ఎంతో ఆశగా ఎదురుచూసింది. కానీ, ప్రస్తుత నిర్ణయం కార్యకర్తల ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే చెప్పాలి.పార్టీ అధికారికంగా చెబుతున్న ప్రధాన కారణం సభ్యత్వ నమోదు. ఇప్పటివరకు దాదాపు 8.70 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు గడువు రేపటితో ముగియాల్సి ఉన్నా, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ గడువును పొడిగించే ఆలోచనలో అధిష్టానం ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలంటే గణాంకాలు ముఖ్యం కాబట్టి, సభ ఏర్పాట్ల కంటే సభ్యత్వాలపైనే పూర్తి దృష్టి పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సభ రద్దు వెనుక ఇతర బలమైన కారణాలున్నాయని సమాచారం. సభ్యత్వ నమోదుతో పాటు మరికొన్ని అంశాలు కూడా ఇందుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే కేడర్‌కు ఎండ దెబ్బ తగలకుండా చూడటం అధినేత బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన కల్తీ పాలు, బాణాసంచా పేలుడు ఘటనలు పార్టీ వర్గాల్లో కొంత ఆవేదనను నింపాయి. ఇలాంటి సమయంలో భారీ వేడుకలు నిర్వహించడం సబబు కాదని పార్టీ భావించి ఉండవచ్చు. పిఠాపురం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం కావడంతో, అక్కడ ఎలాంటి అపశ్రుతులు జరగకూడదని, అత్యంత పకడ్బందీగా మరోసారి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.జనసేన పార్టీకి భావోద్వేగాలే బలం. పవన్ కల్యాణ్ పిలుపు కోసం ఎదురుచూసే లక్షలాది మంది యువత, పిఠాపురం వేదికగా ఆయన ఇచ్చే పొలిటికల్ స్పీచ్ కోసం సిద్ధమయ్యారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇలాంటి భారీ బహిరంగ సభలు కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతాయి. ఇప్పుడు సభ రద్దు కావడంతో, క్షేత్రస్థాయిలో కేడర్ డీలా పడిపోయింది. పార్టీ బలోపేతం ముఖ్యమే కానీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కూడా అంతే ముఖ్యమనేది సగటు జనసైనికుడి ఆవేదన.నిర్ణయం కఠినంగా ఉన్నా, పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పవన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. సభ రద్దుతో వచ్చిన అసంతృప్తిని పోగొట్టాలంటే, సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించడమే కాకుండా, త్వరలోనే మరో భారీ మేనిఫెస్టో సభ లేదా ప్లీనరీ లాంటి కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది.

# రంజాన్ మాసం సహనం, దానం, సహోదర భావానికి ప్రతీక:

## బోయిన్ పల్లి ఇఫ్తార్ విందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్




సికింద్రాబాద్

నియోజకవర్గం లోని బోయిన్ పల్లి కడక్ పుర ప్రాంతం లోని నేతాజీ నగర్ లో సయ్యద్ అమీర్ గారి ఆధ్వర్యంలో గత 14 ఏళ్ళుగా నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం హాజరయ్యారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నిష్ఠగా ఉపవాస దీక్ష చేస్తారని, భారతదేశంలో సర్వ మతాలు సమానమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఈ పవిత్ర దినాల ముఖ్య ఉద్దేశం అందరూ దాన, సహన, సహోదర భావ గుణాలతో ప్రవర్తించాలని చెప్పారు. ఇన్నేళ్ళుగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్న అమీర్ భాయ్ ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెంట కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, మారుతి గౌడ్,బల్వంత్ రెడ్డి, అరుణ్ యాదవ్, ప్రభు గుప్త, హైదర్, రియాజుద్దీన్, సదానంద్ మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# యుద్ధం ఎఫెక్ట్... మామిడి రైతుల విలవిల



విజయవాడ, మార్చి 11

దేశ విదేశాల్లో తెలుగు వాళ్లు ఎక్కడున్నా మార్చి నెల రాగానే మామిడి కాయలే గుర్తొస్తాయి. తెలుగు వాళ్లే కాదు.. విదేశీయులు కూడా మన మ్యాంగోల కోసం ఎదురు చూడాల్సిందే..! ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రతి ఏటా విదేశాలకు టన్నుల కొద్దీ మామిడి ఎగుమతి అవుతూ ఉంటుంది. అందులోనూ.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఫుల్ డిమాండ్.. నూజివీడు రసాలు పేరు చెప్తే నోరూరాల్సిందే.. అందుకే.. ఇక్కడి నుంచి దేశ విదేశాలకు మన మామిడి ఎగుమతి అవుతుంది. దేశ విదేశాల్లోనూ మన మామిడి మస్తు గిరాకీ ఉండడంతో వ్యాపారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. అయితే.. ఇదంతా గతేడాది వరకు.. ఇప్పుడు సీన్ మారిపోయింది. నూజివీడు మామిడి దిగుబడి భారీగా వచ్చే అవకాశం ఉన్నా.. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వార్ కారణంగా ఎగుమతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఎగుమతి దారులకు ఈసారి ఆర్డర్స్ భారీగా ఉన్నాయి. కానీ.. ఇరాన్, ఇజ్రాయెల్ వార్.. మామిడి ఎగుమతిపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే.. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలకు మామిడి పండ్లు ఎక్కువగా ఆకాశ మార్గంలోనే ఎగుమతి అవుతుంటాయి. కానీ.. యుద్ధం కారణంగా ఇప్పటికే.. కొన్ని ఫ్లైట్స్ రద్దు కావటం, కొన్ని ఎయిర్‌వేస్‌లు ఛార్జీలు పెంచడం లాంటి పరిణామాలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఆయా దేశాల్లో మామిడికి భారీగా డిమాండ్ ఉన్నా.. దానికి తగ్గట్టుగా ఎగుమతి చేయలేకపోతున్నామని ముంబైకి చెందిన ఎక్స్‌పోర్ట్ నిర్వాహకులు సమీర్ చెప్తున్నారు.వార్ ఎఫెక్ట్ నూజివీడు మామిడికి ఇబ్బందులు తెచ్చి పెడితే.. మహబూబ్‌నగర్ జిల్లా మామిడి రైతులను తెగుళ్లు సర్వనాశనం చేస్తున్నాయి. తీపి ఫలాలు పండించే కొల్లాపూర్ మామిడి రైతులకు నాలుగేళ్లుగా చేదు ఫలాలు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణం, పలు రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. కాయలతో నిండుగా కనిపించాల్సిన మామిడి చెట్లు.. వాడిపోయిన పూతలతో దర్శనమిస్తున్నాయి. ఎకరాలకు ఎకరాలు కాత, పూత లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లక్షల పెట్టుబడితో ఏడాదంతా సాగు చేస్తే.. చివరికి చీడ, పీడలతో కూడిన చెట్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ మామిడికి ప్రతి ఏటా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఈ ఏడాది సుమారు 35వేల ఎకరాల్లో మామిడి పంట పండింది. నేల స్వభావం, నీటి లక్షణాలతో కొల్లాపూర్ మామిడికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. దేశీయంగా ఎంతో గుర్తింపు ఉన్న కొల్లాపూర్ మామిడి.. అమెరికా, మలేషియా, అరబ్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంది. కానీ.. గత నాలుగేళ్లుగా కొల్లాపూర్ మామిడి రైతులను తెగుళ్ల కష్టాలు వెంటాడుతున్నాయి. నల్లతామర, తేనేమంచు, బూడిద తెగుళ్లు మామిడి పూతను పట్టి పీడిస్తున్నాయి. వాతావరణ మార్పులతో పూత, కాత దెబ్బ తినడం మామిడి రైతులకు ఇబ్బందిగా మారింది.మొత్తంగా.. ఒకవైపు.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఇజ్రాయెల్-ఇరాన్ వార్ శనిలా మారితే.. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మామిడిని తెగుళ్లు, వాతావరణ మార్పులు పట్టి పీడిస్తు?న్నాయి. ఫలితంగా.. మామిడి రైతులను ఆదుకునేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు

# పార్టీ తోడు లేకుంటే మీరంతా ఎక్కడ.. చంద్రబాబు క్లాస్?!

విజయవాడ, మార్చి 11

టీడీపీ అధినేత చంద్రబాబు. వివాదాస్పదంగా మారిన ఎమ్మెల్యేలకు తనదైన శైలిలో చెక్ చెప్పారు. అందరూ బుద్ధిగా ప్రవర్తించాలని లేకుంటే వేటు తప్పదని స్మూత్ గా హెచ్చరించారు. ప్రజలు కూటమి సర్కార్ పై నమ్మకముంచి గెలిపించారని.. లేదంటే మీరంతా ఎక్కడుండేవారు గుర్తుచేసుకోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, తాను, పవన్ కల్యాణ్.. కలిసికట్టుగా సాగుతుంటే.. మీరు మాత్రం లేనిపోని వివాదాలతో కాలం గడుపుతున్నారని హెచ్చరించారు.చంద్రబాబు అసెంబ్లీ వేదికగానే ఎమ్మెల్యేలకు ఏకమొత్తంగా క్లాస్ ఇచ్చేశారు. ఎవరికివారు తామే బలవంతులం అనుకుంటున్నారని, అలా అయితే 2019లో ఎందుకు పరాజయం పాలయ్యారో ఆలోచించుకోవాలని చురకలు అంటించారు. తాను, పవన్ కళ్యాణ్, మోడీ ముగ్గురు కలిస్తేనే ప్రజలు విశ్వసించి ఓట్లేశారని, ఈ కూటమి సజావుగా సాగేందుకు నాయకులు కూడా కలిసి ఉండాలని తేల్చి చెప్పారు. అంతేకాదు, ఎవరైనా తమకు సొంత బలం ఉంటుందని అనుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.కూటమిలో ఉన్న పవన్, మోడీ, తాను ప్రజలకు మరింత చేరువ అవుతున్నామని, క్షేత్రస్థాయిలో నాయకులు కీచులాడుకోవడం వస్తే అది వారికే నష్టమని వ్యాఖ్యానించారు. కలివిడిగా ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. అలాకాదని అనుకుంటే అప్పుడు తెలుస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. కూటమిగా ఉండాల్సిన అవసరం అందరికీ ఉ ంటుందని వ్యాఖ్యానించారు.నేతలు తమంత వారు లేరని భావిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వివాదాలు కూడా అదేవిధంగా కొనసాగుతున్నాయి. గతం నుంచి వివాదాలకు దిగుతున్న నేతలు కొందరు అయితే, కొత్తగా మరికొందరు వివాదాలకు కేంద్రంగా మారుతున్నారు. దీంతో పైస్థాయిలో కూటమి నాయకుల మధ్య ఐక్యత ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్లో మాత్రం ఒకింత ఇబ్బందికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

===================

# ట్రెండింగ్ లో చైనా ప్రొఫెసర్ ప్రిడిక్షన్

బీజింగ్, మార్చి 11,

ఇరాన్, అమెరికా యుద్ధం 11వ రోజుకు చేరింది. ఇటు ఇరాన్, అటు అమెరికా వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ అణు కార్యకలాపాలు కొనసాగిస్తోందన్న సాకుతో అమెరికా ఈ యుద్ధం మొదలు పెట్టింది. మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్‌ను మట్టుబెట్టినా ఇరాన్ వెనక్కు తగ్గడం లేదు. అమెరికాతోపాటు అమెరికాకు మద్దతుగా ఉన్న ఇజ్రాయెల్, యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, దుబాయ్, బహ్రెయిన్‌తోపాటు 14 దేశాలపై దాడులు చేస్తోంది. యుద్ధం నాలుగు వారాలు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాజాగా యుద్ధం సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారన్న చర్చ మొదలైంది.చైనా విశ్లేషకుడు ప్రొఫెసర్ జియాంగ్ ఇరాన్ అమెరికా యుద్ధంపై 2024లో చేసిన ప్రెడిక్షన్ ఇప్పుడు వైరల్‌గా మారింది. 2024 మేలో ట్రంప్ మళ్లీ అధ్యక్షుడవుతాడని, అమెరికా?ఇరాన్ యుద్ధం జరుగుతుందని, అమెరికా ఓడిపోతుందని జియాంగ్ ఊహించాడు. మొదటి రెండు సంభవించాయి, మూడోది జరిగే అవకాశం ఉందని సోషల్ మీడియా వైరల్. ఇరాన్ అసిమెట్రిక్ ఆయుధాలు, ప్రాక్సీలతో పోరాడుతుందని చెప్పాడు.ఇరాన్ పర్వతాలు, విశాల భూభాగం ఆక్రమణకు మలుపిస్తాయి.

మిలియన్ల సైన్యం అవసరమని జియాంగ్ అంచనా. అమెరికా దూరం వల్ల లాజిస్టిక్స్ సమస్యలు తలెత్తుతాయి. గల్ఫ్ ఆయిల్ కేంద్రాలు, ఆర్మూజ్ జలసంధి మూతపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.ఏథెన్స్ స్పార్టాతో పోల్చుకుని బలవంతుడైనా దూర యుద్ధంలో ఓడిపోయింది. దీర్ఘకాలం యుద్ధం కొనసాగడం, దూర ప్రాంతం నగరంపై దాడి చేయడం కారణంగా లాజిస్టిక్ సమస్యలు వచ్చాయి. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా ఏథెన్స్ ఓడిపోయింది. ఇదే పరిస్థితి అమెరికాకు వస్తుందని జియాంగ్ తెలిపారు.యుద్ధం కారణంగా అమెరికా రిసోర్సెస్ తగ్గుతూ, రష్యా?చైనా బలపడతాయని ప్రిడిక్షన్. ఇరాన్ గెలిచినా ప్రాంతీయ నష్టాలు తీవ్రం. యుద్ధం పొడిగితే ప్రపంచ చమురు ధరలు, ఆర్థిక అస్థిరత పెరుగుతాయి. జియాంగ్ ఊహాలు నిజమైతే అమెరికా ఆధిపత్యం బలహీనపడుతుంది.

# 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు

హైదరాబాద్, మార్చి 11,

మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం బాపూఘాట్ వద్ద రూ. 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు సంబంధించిన డీపీఆర్ రెడీ అయింది. 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆకర్షణలు. మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులను ఏర్పాటు చేస్తూ డీపీఆర్ సిద్ధం చేశారు.హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్ష్యంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది. ఈ చర్యలో భాగంగా.. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి.బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35-50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు.మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మొ?త్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

# మూసీలో పొంగుతున్న రాజకీయ కాలుష్యం

హైదరాబాద్, మార్చి 11,

హైదరాబాద్‌కు ఇప్పుడు కొత్త జ్వరం పట్టుకుంది. అదే.. 'మూసీ ఫీవర్'. నదిని శుద్ధి చేస్తామని ఒకరు అంటే, ఆ ప్రాజెక్టు వెనుక 'అతివృష్టి' (అవినీతి) ఉందని మరొకరు, అసలు తాము వస్తే మూసీని 'అమృతం'లా మార్చేవాళ్ళమని ఇంకొకరు.. మొత్తానికి మూసీ నీళ్ళ కంటే, మూసీపై జరుగుతున్న రాజకీయ కాలుష్యమే ఇప్పుడు సిటీలో హాట్ టాపిక్.మన రాజకీయ నాయకులకు ఏదైనా ప్రాజెక్టు అంటే మొదట గుర్తొచ్చేది 'విగ్రహం'. మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 5,000 కోట్లు దాటినా, ప్రతిపక్షాలకు మాత్రం అందులో కనిపించేది కేవలం ఒక విగ్రహం మాత్రమే! "అమ్మో! విగ్రహానికి వంద కోట్లా?" అంటూ ఒక వర్గం గగ్గోలు పెడుతుంటే, అటువైపు ప్రభుత్వం ఏమో "మేము చేసేది నది ప్రక్షాళన, విగ్రహం ఒక్కటే కాదు" అని వివరణ ఇచ్చుకోలేక పడుతున్న పాట్లు చూస్తుంటే.. అసలు ప్రాజెక్టు దేనికో, అది దేనికో అర్థం కాక సామాన్యుడు తల పట్టుకుంటున్నాడు.సీఎం రేవంత్ రెడ్డి గారి ఉద్దేశం చూస్తుంటే, హైదరాబాద్‌ను లండన్ థేమ్స్ నది రేంజ్‌లోకి తీసుకెళ్లాలని ఉంది. "సబర్మతిని అభివృద్ధి చేయొచ్చు, యమునను బాగు చేయొచ్చు.. మరి మన మూసీని ఎందుకు చేయకూడదు?" అని ఆయన అడుగుతుంటే, ప్రతిపక్షాలు "మీరు చేసేది అభివృద్ధి కాదు, 'లూటిఫికేషన్'" అని ఎదురుదాడి చేస్తున్నాయి. చివరకు పరిస్థితి ఎలా ఉందంటే, మూసీలో నీళ్లు పారడం సంగతి పక్కన పెడితే, మాటల యుద్ధం మాత్రం వరదలా పారుతోంది.ఏ రాజకీయ గొడవైనా చివరకు 'లీగల్ నోటీసుల' దగ్గర ఆగుతుంది. ప్రాజెక్టుపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నేతలకు ఏకంగా లీగల్ నోటీసులు రావడంతో.. ఇప్పుడు అసలు పోరాటం 'వాస్తవాల' మీద జరుగుతుందా లేక 'కోర్టు మెట్ల' మీద జరుగుతుందా అనే అనుమానం రాక మానదు. ఆరోపణలు చేయడం, నోటీసులు రావడం, మళ్లీ ప్రెస్ మీట్లు పెట్టడం..

# గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

మేడ్చల్‌మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ఎక్సైజ్ పిఎస్ పరిధి పర్వతాపూర్ రోడ్డులో గంజాయి విక్రయాలు జరుపుతున్న కుమ్మరి గోపి అనే వ్యక్తిని అదుపులోకి ఎస్.టి.ఎఫ్ టీం అదుపు లోకి తీసుకుంది. నిందితుడు కుమ్మరి గోపి వద్ద 1.3 కేజీల గంజాయి స్వాధీనం. చేసుకుంది. నిందితుడిని గంజాయిని ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కి అప్పగించింది. ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా రిమాండ్ కి తరలించారు.

==============================

# కల్తీ పాల ఘటన మూడేళ్ల చిన్నారి మృతి

రాజమండ్రిరాజమండ్రి కల్తీ పాల ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి మృతి చెందాడు. 23 రోజులుగా మృత్యువుతో పోరాడి జయకృష్ణ (3) ప్రాణాలు విడిచాడు. దాంతో కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య 123 కు చేరింది. జయకృష్ణ మృతితో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# అదుపుతప్పి బోల్తా పడి వాగులోకి దూసుకు వెళ్లిన కారు

పల్నాడుదాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నల్లవాగు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడి వాగులోకి దూసుకెళ్లింది. అద్దంకి నార్కెట్పల్లి హైవే రహదారిపై హైదరాబాదు వైపు నుండి వస్తూ తిరుపతి వెళుతున్న కారు అదుపుతప్పి నల్లవాగు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని అత్యవసర చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# 12 నైట్ ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి

హైదరాబాద్, మార్చి 11,

తెలంగాణలో సాయంత్రం పూట బీటెక్ చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఉన్న 12 ఇంజినీరింగ్ కాలేజీల్లో పలు రకాల బీటెక్ కోర్సులను సాయంత్రం పూట చెప్పనున్నారు. గత కొంతకాలంగా ఈ సాయంత్రం బీటెక్ కోర్సులకు సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. తాజాగా తుది ఆమోదం లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతినిచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలో విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విద్యా శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణలో 12 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సాయంత్రం బీటెక్ కోర్సులను అందించే నిర్ణయానికి రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత కొన్ని నెలలుగా ఈ సాయంత్రం ఇంజినీరింగ్ కోర్సుల ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ విద్యా శాఖ జీఓ నంబర్ 30ని జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 కాలేజీల్లో ఈ ఈవెనింగ్ బీటెక్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కాలేజీకి 1 నుంచి 5 కోర్సులు చెప్పేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఇక ఒక్కో కోర్సులో తక్కువలో తక్కువగా 15 సీట్లు.. ఇక అత్యధికంగా 60 సీట్లకు అవకాశం కల్పించారు. ప్రస్తుత 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ కాలేజీల్లో ప్రవేశాలు జరుపుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసి.. కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నవారు ఈ బీటెక్ కోర్సుల్లో చేరొచ్చని అధికారులు వెల్లడించారు. ఒకవేళ ఇప్పటికే బీటెక్ కోర్సు పూర్తి చేసిన వారు ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చు. ఇలా చేరిన వారికి సాయంత్రం వేళ తరగతులను నిర్వహించనున్నారు. ఈ సాయంత్రం కోర్సులకు కూడా రెగ్యులర్ కోర్సులకు ఖరారు చేసిన ఫీజునే చెల్లించాల్సి ఉంటుంది. 2024లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈసెట్ కన్వీనరే ఈ పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ఉన్నత విద్యామండలి కూడా ఈసెట్ కన్వీనర్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య చంద్రశేఖర్‌కు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. ఎంటెక్ సీట్ల భర్తీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయగా.. అయితే వాటిని ఎలా భర్తీ చేస్తారు అనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత లేదు. అయితే 3, 4 కాలేజీల్లోనే సాయంత్రం ఎంటెక్ కోర్సులకు అనుమతులు వచ్చాయి.

సాయంత్రం బీటెక్ కోర్సులకు అనుమతి పొందిన కాలేజీలు

చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)

వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి)

మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కాలేజీ (ఎంవీఎస్ఆర్)

స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (స్టాన్లీ)

మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (మెథడిస్ట్)

మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)

మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీ

అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలాజికల్ సైన్సెస్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేపలగడ్డ)

జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (మహబూబ్‌నగర్)

అనుబోస్ ఇన్‌స్టిట్యూ?ట్ ఆఫ్ టెక్నాలజీ (ఖమ్మం జిల్లా పాల్వంచ)

సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం)

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీ (మేడ్చల్ జిల్లా)

# ఆ రెండు జిల్లాలకు కేంద్రం తీపి కబురు

వరంగల్, మార్చి 11,

ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద తెలంగాణలోని వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 చొప్పున మొత్తం 151 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం కేటాయించింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. అయితే, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రస్తుతానికి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి టోకన్ సాహు వెల్లడించారు. విద్యుత్ సౌకర్యాలు, ఇతర నిర్మాణాలు పూర్తయిన తర్వాతే ఈ బస్సులు క్షేత్రస్థాయికి చేరుతాయని ఆయన స్పష్టం చేశారు.వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు గుడ్‌న్యూస్. ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద తెలంగాణకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 మె?త్తంగా 151 విద్యుత్తు బస్సులు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు.ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద నిధుల కేటాయింపు అనే విషయం ఈ-బస్‌లకు అనుబంధమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ద్వారా ప్రతిపాదనలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలూ అందలేదని మంత్రి టోకన్ సాహూ స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేటాయించిన బస్సుల్లో ఇప్పటివరకూ ఒక్కటి కూడా అక్కడికి తరలించలేదని చెప్పారు. ఈ బస్‌ల నిర్వహణకు అవసరమైన నిర్మాణ, విద్యుత్తు పరమైన మౌలికవసతుల అభివృద్ధి తర్వాతే వాటిని క్షేత్రస్థాయికి తరలించనున్నట్లు వెల్లడించారు.ఇక 2022-25 మధ్య కాలంలో వరంగల్‌కు 3.52 లక్షల మంది, గోల్కొండకు 47.41 లక్షల మంది, చార్మినార్‌కు 35.85 లక్షల మంది పర్యాటకులు వచ్చినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. సందర్శకులకు టికెట్ల విక్రయం ద్వారా గత మూడేళ్లలో గోల్కొండ నుంచి రూ.15.30 కోట్లు, చార్మినార్ నుంచి రూ.9.30 కోట్లు, వరంగల్ నుంచి రూ.73.71 లక్షల ఆదాయం వచ్చినట్లుగా వెల్లడించారు.కాగా, ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసున్నప్పటి నుంచి బస్సులు ఖాళీగా ఉండటం లేదు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్రంలో ఏ మూల నుంచి ఏమూలకైనా ఫ్రీ జర్నీ ఉండటంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. గతంలో హైదరాబాద్ సిటీ బస్సుల్లో మాత్రమే రద్దీ ఉండేది. ప్రస్తుతం జిల్లా బస్సుల్లోనూ రద్దీ పెరిగింది. తాజాగా కేంద్రం ప్రకటించిన బస్సులతో రద్దీ తగ్గే ఛాన్సుంది. దాంతో పాటు ప్రయాణికుల ప్రయాణం మరింత సాఫీగా సాగుతుంది.

# సాగునీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

సూర్యాపేట మార్చి 11,

సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట?జనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట? జనగామ ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు. సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట?జనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట? జనగామ ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు.

# దానం, కడియం లకు క్లీన్ చిట్

హైదరాబాద్ మార్చి 11,

పార్టీ ఫిరాయింపు కేసులు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పు ప్రకటించారు. ఎనమిది మంది ఎమ్మెల్యేల తరహాలో దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చిట్ ఇచ్చారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసారు. వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, కూతురు కడియం క్యావ్యకు మద్దతుగా కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేసారు.


# మరింత విస్తరించనున్న ఐటీ కారిడార్

హైదరాబాద్, మార్చి 11,

హైదరాబాద్ నగరం దేశంలోనే ఐటీ క్యాపిటల్‌గా ఎదుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అత్యాధునిక మౌలిక వసతులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం కారణంగా ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ నెలకొల్పాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి సంస్థలు హైదరాబాద్ నగరాన్ని తమ కేంద్రంగా ఎంచుకున్నాయి. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలలో విస్తరించిన ఈ ఐటీ కారిడార్‌లో లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉద్యోగాలు చేస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు రెడీ అవుతున్నాయి.రాజధాని హైదరాబాద్‌లో ఐటీ కారిడార్ పరిధిని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాం గూడలతో పాటు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో మరిన్ని ఐటీ సంస్థలు, క్లస్టర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ మేరకు కంపెనీల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు టీజీఐఐసీ సన్నాహాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం గచ్చిబౌలి సమీపంలో టీజీఐఐసీ ఆధీనంలోని ప్రభుత్వ భూములను వేలం వేయగా ఎకరా రూ.170 కోట్లకుపైగా అమ్ముడుపోయింది. దీంతో ఐటీ కారిడార్‌ను విస్తరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.నగర శివారులోని ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు అక్రమార్కులు రికార్డులను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న గ్రామాలు, వ్యవసాయ భూముల్లో 60 శాతం నిజాం నవాబు హయాంలో దానమిచ్చిన భూములే. నిజాం వారసులు లేకపోవడం, భూములకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు పక్కాగా క్రమపద్ధతిలో రూపొందించడంతో వీటిలో 90 శాతం ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఆయా భూములను సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. నిజాం వారసుల నుంచి దానం పొందామని, వారు జీపీఏ ఇచ్చారంటూ నకిలీ పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు.శేరిలింగంపల్లి మండలంలోని 3 గ్రామాల్లో 180 ఎకరాల ప్రభుత్వ భూములపై ప్రస్తుతం వివాదాలు కొనసాగుతున్నాయి. గండిపేట మండలంలోని 4 గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల భూములపై ప్రైవేటు వ్యక్తులు వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములు, చెరువులను అక్రమార్కుల నుంచి రక్షించేందుకు అధికారులు డిజిటల్ సర్వేలు చేయిస్తు?న్నారు. త్వరలోనే ఆ భూములను స్వాధీనం చేసుకొని ఆయా ప్రాంతాల్లో ఐటీని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మండల ఎన్నికలకు సిద్ధం

అదిలాబాద్, మార్చి 11



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రభుత్వ పాలనకే పరిమితం కాకుండా పార్టీ యంత్రాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేసే పనిలో పడింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకున్న అధిష్టానం, పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మండల స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది.పార్టీని గాడిలో పెట్టేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పష్టమైన డెడ్‌లైన్లను విధించారు. మార్చి 15 నాటికి మండల అధ్యక్షుల ఎంపిక, మండల కమిటీల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు. మార్చి 25 నాటికి మొత్తం మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియ ముగియాలి. అలాగే మార్చి 30 నాటికి గ్రామ పంచాయతీ, పట్టణ అధ్యక్షులు, వారి కమిటీల ఎంపిక పూర్తి కావాలని నిర్దేశించారు.ఈ సంస్థాగత మార్పులకు వికారాబాద్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ప్రధాన కారణంగా చెప్పొచ్చు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో ముఖాముఖి చర్చించడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సామాజిక అంశాలు, ప్రభుత్వ విధానాలపై నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వడం వల్ల డీసీసీ అధ్యక్షులకు తమ జిల్లాల్లో పార్టీని ఎలా నడిపించాలో ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది. అదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పేర్కొన్నట్లుగా, ఈ శిక్షణ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడమే కాకుండా, క్షేత్రస్థాయి నాయకులతో అగ్ర నాయకత్వం నేరుగా మమేకమయ్యేలా చేసింది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే కాంగ్రెస్ ప్రాథమిక లక్ష్యంగా ఈ సంస్థాగత మార్పులు, చేర్పులు చేస్తున్నట్టు సమాచారం. మండల స్థాయిలో కమిటీలు బలంగా ఉంటేనే ఓటర్లను నేరుగా చేరుకోవడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలన్నా, స్థానికంగా పార్టీ పట్టు కోల్పోకుండా ఉండాలన్నా మండల స్థాయి నాయకత్వం కీలకం. కొత్తగా నియమితులయ్యే మండల అధ్యక్షులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఆహ్వానించి, మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు జరపడం ద్వారా పార్టీలో అంతర్గత అసమ్మతిని తగ్గించాలని అధిష్టానం భావిస్తోంది. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుండటం వల్ల పారదర్శకత పెరుగుతుంది.కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ మండల స్థాయి పునర్వ్యవస్థీకరణ కేవలం పదవుల భర్తీ మాత్రమే కాదు. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2028 ఎన్నికలకు బలమైన పునాది వేస్తుందని అంచనా వేస్తున్నారు. కేడర్‌లో జవజీవాలు నింపడం ద్వారా ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా, అధికార పార్టీగా తన బలాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. మార్చి 30 నాటికి ఈ ప్రక్రియ పూర్తయితే, ఏప్రిల్ నుండి తెలంగాణ కాంగ్రెస్ సరికొత్త ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో కనిపించే అవకాశం ఉంది.

# పొంగులేటిని వెంటాడుతున్న గులాబీ దళం

ఖమ్మం, మార్చి 11,



తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని గులాబీ పార్టీ నేతలు వెంబడిస్తున్నారు. వదల బొమ్మాలి అన్నట్టుగా ఆయన గురించి రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే శ్రీనివాసరెడ్డి కుమార్ రెడ్డి మీద ఆరోపణలు వచ్చాయి. ఆయన సింగపూర్ నుంచి నిషేధిత వస్తువులను దిగుమతి చేసుకున్నారని విమర్శలు వినిపించాయి.ఈ సంఘటన తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద గులాబీ పార్టీ తీవ్రంగా దృష్టి సారించింది. అప్పట్లో ఆయన కంపెనీల మీద ఐటి అధికారులు దాడులు చేసిన నేపథ్యంలో.. ఈ వ్యవహారాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా ప్రచారం చేసింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ముసలం తెస్తున్నారని ఆరోపణలు చేసింది. సరిగ్గా దీపావళికి ముందు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గులాబీ పార్టీ నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ నేతల అక్రమాలకు సంబంధించి ఆటం బాంబులు పేలబోతున్నాయని హెచ్చరించారు. అయితే పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తగ్గట్టుగా సంచలన వ్యవహారాలు ఏవీ వెలుగులోకి రాలేదు.ఇక ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి ఒక కీలక విషయాన్ని గులాబీ నేతలు బయటికి తీసుకొచ్చారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ అక్రమంగా కంకర క్రషింగ్ చేపడుతోందని ఆరోపించారు. గులాబీ నేతలు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, క్రిశాంక్ రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్న క్రషర్ వద్దకు వెళ్లారు. కొండలను మొత్తం పొంగులేటి కంపెనీ పిండి చేస్తోందని మండిపడ్డారు.గులాబీ నేతల ఆరోపణల నేపథ్యంలో పొంగులేటి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కంపెనీ వివరణ ఇచ్చింది. తాము నిబంధనలకు వ్యతిరేకంగా ఏ పనీ చేయడం లేదని పేర్కొంది. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే క్రషర్ నిర్వహిస్తున్నామని పేర్కొంది. గులాబీ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని.. ఆ విమర్శలు మొత్తం సత్య దూరమని స్పష్టం చేసింది. అడ్డగోలుగా ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

============

# కస్తూర్బా పాఠశాలలు నిర్లక్ష్యపు నీడ

మహబూబ్ నగర్ , మార్చి 11,

నాగర్ కర్నూల్ జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు నిర్లక్ష్యపు నీడన కొనసాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరుగుతోంది. దీంతో కస్తూర్బా పాఠశాలలకు విద్యార్థులు చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరిగింది. పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన బా లికలు అత్యధిక శాతం 10, ఆ తర్వాత ఇం టర్ ఉన్నత చదువులకు కస్తూర్బాలు వేదికగా మారుతున్నాయి. దానికి తోడు ప్రభు త్వాలు కూడా నాణ్యమైన విద్యతోపాటు భోజనం కూడా అందించాలన్న ఉద్దేశంతో మెనూ పకడ్బందీగా అమలు చేయాలని భా రీగా నిధులు కేటాయించింది.ఇంతవరకు బాగానే ఉన్నా ప్రైవేటు పాఠశాల ఉత్తీర్ణత శాతం హాజరు శాతం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో కొంతమంది బడి దొంగలు, ఉన్నత వర్గాలకు చెందిన కస్తూర్బా పాఠశాల టీచర్లు, ప్రత్యేక అధికారులు క్రమంగా కస్తూ ర్బా పాఠశాలల ప్రాధాన్యత తగ్గించాలన్న కుట్రకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులను వారి సామర్థ్యాల ను ఎప్పటికప్పుడు పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యను అందించాల్సిన బాధ్యత ఉంది.దాంతోపాటు మెరుగైన భోజనం అందించేందుకు మెనూ పకడ్బందీ అమలుపరిచేలా పర్యవేక్ష ణ చేయాల్సి ఉంది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి మెరుగుప రిచేందుకు రక్తహీనత నుండి కాపాడేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇవన్నీ పర్యవేక్షించాల్సిన కొంతమంది అధికారులు ఉన్నత వర్గాల వారితో, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకా స్తూ కస్తూర్బా పాఠశాలల పర్యవేక్షణ గాలికి వదిలేసారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రైవేటు పాఠశాలల నుండి తరచు ముడుపులు ముట్టజెప్పే వ్యక్తుల మాటలు నమ్మి జి ల్లా విద్యాశాఖ అధికారులు సైతం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. దానికి తోడు అనుకూలంగా ఉన్న ప్రత్యేక అధికారు లు, సిఆర్టి లను గూడచారి వ్యవస్థగా ఏర్పా టు చేసుకొని వారికి అనుకూలంగా వ్యవహరించే వారికి అందలమెక్కిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే వారిని టార్గెట్ చేసి మరీ హింసకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీనికి తోడు విద్యార్థులకు అందించాల్సిన భోజనం పంపిణీ చేసే సరుకుల విషయంలో ఎక్కువ శాతం పంపిణీ చే సినట్లు రికార్డులు ఎక్కించి, చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తీవ్ర విమర్శలు ఉ న్నాయి. జిల్లా డీఈవో కార్యాలయంలో కొం తమంది అక్రమంగా డిప్యూటేషన్ పై చొరబడి ఇలాంటి బడి దొంగలకు బద్ధకస్తులకు వంత పాడుతున్న వారు కూడా లేకపోలేదని విమర్శలున్నాయి. కొంత కాలంగా కస్తూర్బా పాఠశాలలో తరచూ అవినీతి అక్రమాలు, నెలల తరబడి పాఠశాలకు వెళ్లకపోయినా న కిలీ హాజరు రిజిస్టర్లు నమోదు చేస్తూ తప్పించుకు తిరిగారిగిన వారు ఉన్నారు.విద్యార్థులు స్నానం గదుల్లోకి వెళ్లి వీడియో రికార్డులు చేసి ఇతరులకు పంపిన టీచర్లపై కూడా చర్యలకు వెనుకబడిన పరిస్థితి. తిమ్మాజిపేట మండలం కస్తూర్బా పాఠశాలలో సీఆర్పీలు ప్రత్యేక అధికారుల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతున్నప్పటికీ విద్యాశాఖ అ ధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు వారి మధ్య నలిగిపోతున్నారు. తాజా గా నాగర్ కర్నూల్ జిల్లాలోని ఓ కస్తూర్బా పాఠశాలలో సుమారు 9 నెలల పాటు గ ర్భం దాల్చిన బాలిక అక్కడే ఉ న్నప్పటికీ గుర్తించలేకపోయారు. చివరికి ప్రసవం అనంతరం ఈ ఘటన వెలుగులోకి రాగా సుమా రు వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సదరు కస్తూర్బా పాఠశాల బాధ్యులపై చర్యలకు వెనకడుగు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. సుమారు బద్ధకస్తులు, బడి దొంగలు పనిచేస్తున్న పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు దాదాపు కొల్లాపూర్ నియోజకవర్గంలోనే అ ధికంగా ఉన్నాయని బాహాటంగా విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ ప్రాంతంలోనే వరుస ఘటనలు చోటు చేసుకున్న పరిస్థితి. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కేవలం ప్రచారాలు ప్రకటనలకే పరిమి తం అవుతున్నారని ఈ వరుస ఘటనలతో మరోసారి రుజువైంది.9 నెలల పాటు స దురు పాఠశాలలోనే ఉన్న బాలికను కనీసం తోటి బాలికలు, క్లాస్ టీచర్లు, వైద్య పరీక్షలు అందించే వైద్య సిబ్బంది, భోజనం అందించే వంట ఏజెన్సీలు, చివరగా పర్యవేక్షణ చేయాల్సిన ప్రత్యేక అధికారి, జిల్లా అధికారి సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేటతెల్లమైంది. ఈ ఘటన జరిగిన వెంటనే విచారణ కోసం వచ్చిన రాష్ట్ర ఉ న్నతాధికారుల ముందే మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. ఉ డికి ఉడకని అన్నం వడ్డించి తమ నిర్లక్ష్యాన్ని అధికారి ముందే రుజువు చేసుకున్నారు.అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ కి అందించగా ఇప్పటి వరకు సదరు అధికారులపై, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం జంకుతున్న పరిస్థితి. దీని వెనక రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెర వెనుక కాపాడుతున్నారా తన పేరు చెప్పుకొని కిందిస్థాయినేతలే కాపాడుతున్నారా అ న్న అనుమానాలు సర్వత్ర వ్యక్తమవుతున్నా యి. కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిని ఉన్నత వర్గానికి చెందినవారు కావడంతోనే ఆ వర్గం రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతోందని విమర్శలు ఉన్నాయి.

# 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యా శాఖకు రూ.118.89 కోట్లు

## డిజిటల్ క్లాస్ రూములు, మౌళిక సదుపాయాలు విద్యా రంగ అభివృద్ధికి అగ్రపీఠం వేసిన టిటిడి

తిరుపతి, 2026 మార్చి 11

టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల సమగ్ర అభివృద్ధికి 2026?27 ఆర్థిక సంవత్సరానికి రూ.118.89 కోట్ల నిధులను టిటిడి కేటాయించింది. అత్యాధునిక సాంకేతికత, విద్యార్థుల సామర్థ్యాల పెంపు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యా శాఖలో సమగ్ర మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.గతంలో టిటిడి విద్యా శాఖలో జీతాలు మినహా అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులు ఇలా ఉ న్నాయి. 2021?22 సంవత్సరానికి రూ.24.37 కోట్లు, 2022?23 సంవత్సరానికి రూ.39.04 కోట్లు, 2023?24 సంవత్సరానికి రూ.33.08 కోట్లు, 2024?25 సంవత్సరానికి రూ.25.99 కోట్లు, 2025?26 సంవత్సరానికి రూ.13.08 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో భవనాల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి తదితర పనులు చేపట్టారు.ఈ ఏడాది 2026?27 ఆర్థిక సంవత్సరానికి శ్రీ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ మరియు టిటిడి కలిపి విద్యాసంస్థలను మరింత ఆధునికరించి విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మొత్తం రూ.118.89 కోట్లు కేటాయించారు. టిటిడి విద్యా సంస్థల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో టిటిడి విద్యా సంస్థల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఈసారి రూ.118.89 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో టిటిడి విద్యా సంస్థలలో అదనపు తరగతి గదులు, అదనపు వసతి గదుల నిర్మాణం, పాఠశాలలు మరియు కళాశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి స్పోర్ట్స్, సాంస్కృతిక మరియు సహ పాఠ్య కార్యకలాపాలు, టీచింగ్ మరియు నాన్–టీచింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్, సీఏ, క్లాట్ తరహా కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్ ఓరియెంటెడ్ మరియు వృత్తి ఆధారిత కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు.అత్యాధునిక సాంకేతిక బోధనకు పెద్దపీట వేస్తూ డిజిటల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్లు, స్మార్ట్ ప్యానల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వర్చువల్ కాన్ఫరెన్స్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలలో ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, మొబైల్ మెడికల్ యూనిట్ సేవలు అందించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.ప్రత్యేకంగా శ్రీ పద్మావతి మహిళా విద్యాసంస్థల (ఎస్పీడబ్ల్యూ జూనియర్, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు)లో చదువుతున్న విద్యార్థినులకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

## అన్నమయ్య సంకీర్తనలను రాగిరేకుల నుండి పరిష్కరించి బాణీలు కట్టిన ఘనత రాళ్లపల్లి వారిదే

# ఆచార్య కొడిదల శోభ

తిరుపతి, 2026 మార్చి 11

? అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ 47వ వర్ధంతిశ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ విశేష కృషి చేశారని ఎస్పిడబ్ల్యూ మహిళా డిగ్రీ మరియు పిజి కళాశాల తెలుగు అధ్యాపకులు డా.శోభ తెలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఉదయం శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 47వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా డా. శోభ "రాళ్లపల్లి వారు దర్శించిన సారస్వతా లోకము" అనే అంశంపై మాట్లాడుతూ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్యంలోని విశాలమైన సారస్వత ప్రపంచాన్ని లోతుగా అధ్యయనం చేసి తమ రచనల ద్వారా పాఠకులకు పరిచయం చేసిన మహానుభావులని తెలిపారు. ఆయనకు ఉన్న విస్తృతమైన పాండిత్యం, సాహిత్యంపై ఉన్న అపారమైన అభిరుచి, పరిశీలనాత్మక దృష్టి కారణంగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను సమగ్రంగా అర్థం చేసుకుని వాటి సౌందర్యాన్ని స్పష్టంగా వివరిస్తూ సాహిత్యాభిమానులకు మార్గదర్శకత్వం చూపారని ఆమె పేర్కొన్నారు. రాళ్లపల్లి వారు తమ రచనల ద్వారా తెలుగు సారస్వతాన్ని సమృద్ధిగా చేసి సాహిత్య లోకానికి చిరస్థాయిగా నిలిచే సేవలు అందించారని ఆమె కొనియాడారు.తరువాత నగరికి చెందిన తెలుగు పండితులు డా. మలేపట్టు పురుషోత్తమాచారి "రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితం ? రచనలు" అనే అంశంపై మాట్లాడుతూ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్యం మరియు సంగీత రంగాలలో విశిష్టమైన సేవలు చేసిన మహనీయులని తెలిపారు. ఆయన జీవితమంతా సాహిత్యాభివృద్ధికి అంకితమై ఉండి అనేక విలువైన రచనలు చేసి తెలుగు భాషకు కీర్తి తీసుకొచ్చారని చెప్పారు. అలాగే ఆయన పండితత్వం, సంగీతంపై ఉన్న లోతైన జ్ఞానం మరియు సాహిత్యంపై ఉన్న అభిరుచి కలిసి ఆయనను గొప్ప రచయితగా, పండితునిగా నిలబెట్టాయని కొనియాడారు.అనంతరం ఎస్వి విశ్వవిద్యాలయం విశ్రాంత అచార్యులు ఆచార్య దామోదర్ నాయుడు "విమర్శకుడిగా రాళ్లపల్లి" అనే అంశంపై ప్రసంగిస్తూ, రాళ్లపల్లి వారు తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం పొందిన మహనీయులని కొనియాడారు. రాళ్లపల్లి గారు కేవలం సంగీత విద్వాంసుడిగానే కాకుండా, సాహిత్యాన్ని లోతుగా అర్థం చేసుకుని విశ్లేషించే నిశితమైన విమర్శనా దృష్టి కలిగిన గొప్ప సాహిత్య విమర్శకుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. వారి విమర్శలు లోతైన అధ్యయనం, నిష్పాక్షికత మరియు విశ్లేషణాత్మకతతో కూడి ఉ ండి తెలుగు సాహిత్య విమర్శకు విశేష సేవ చేశాయని వివరించారు.

==========================

# 'నిద్రమత్తు వదలండి.. క్షేమంగా ఇంటికి చేరండి"

## అర్ధరాత్రి హైవేలపై వినూత్న 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం - మార్కాపురం జిల్లా పోలీసులు




ఒంగోలురోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు మరియు మార్కాపురం జిల్లా పోలీసులు వినూత్నంగా 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు మరియు సిబ్బంది జాతీయ, రాష్ట్ర రహదారులపై తెల్లవారుజామున 1:00 గంటల నుండి 4:30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీర్ఘదూర ప్రయాణం చేసే డ్రైవర్లు అలసట కారణంగా నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, పోలీసులు హైవేలపై వాహనాలను నిలిపి డ్రైవర్లను ముఖం కడుక్కోవాలని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని మరియు టీ తాగి తాజాగా ప్రయాణం కొనసాగించాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని అప్రమత్తంగా వాహనాలు నడపాలని, వేగ పరిమితులను పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# పెళ్లి విషయంలో ప్రేమజంట వాగ్వాదం.. మాట నెగ్గలేదని ప్రియుడు ఆత్మహత్య

మహబూబాబాద్ మార్చి 11

ఈ రోజే పెళ్లి చేసుకుందామన్న యువకుడు.. ఇంటర్ పరీక్షల తర్వాత చేసుకుందామని చెప్పిన యువతి, దీంతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లాలో ఘటన జరిగింది.

కురవికి చెందిన పెయింటర్ వల్లపునేని శశికుమార్ (21), కేసముద్రం శివారు తండాలోని ఇంటర్ చదువుతున్న యువతి (20).. ఒకరినొకరు సంవత్సర కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే శశికుమార్.. యువతికి ఫోన్ చేసి, ఇద్దరం ఈ రోజే పెళ్లి చేసుకుందామని పట్టుబట్టగా.. అయితే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, అవి పూర్తయ్యాక పెళ్లి చేసుకుందామని యువతి సర్దిచెప్పింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ప్రియురాలు తన మాట వినకపోవడంతో క్షణికావేశానికి గురై శశికుమార్ కురవిలోని తన ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న స్పీకర్

హైదరాబాద్ మార్చి 11

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.

ఇది ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి గా అభివర్ణించారు. బీఆర్ఎస్ బీఫామ్ మీద ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమే. స్పీకర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు. అధికారంలో ఉ న్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించడం తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయంలో సమాధానం చెబుతారని అన్నారు.



# సంగారెడ్డి లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో అంతార్జాతీయ మహిళా దినోత్సవం

మహిళలు అన్ని రంగాలలో అత్యున్న స్థాయికి ఎదగాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర




సంగారెడ్డి జిల్లా (భారత శక్తి న్యూస్) మార్చ్11: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర నేతృత్వంలో అంతార్జాతీయ మహిళా దినోత్సవాన్నీ కోర్టు ప్రాంగణంలో అత్యంత ఘనంగా జరుపుకోవడం జరిగింది.

2026 థీమ్ – "గివ్ టు గైన్" ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం "గివ్ టు గెయిన్" అనే ఇతివృత్తంతో థీమ్ నిర్వహించబడింది. మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని మహిళా సాధికారతకు సమాజం పునరంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి.భవాని చంద్ర,కే.జయంతి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, శ్రీ కృష్ణార్జున, జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి, శ్రీలేఖ ఫోక్సొకోర్టు న్యాయమూర్తి, బి. సౌజన్య, జిల్లా న్యాయ సేధికార సంస్థ సెక్రెటరీ, ఆర్ అనిత,ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి. కె. ధనలక్ష్మి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కోర్టు మహిళా సిబ్బందులు కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్లో ఘనంగా మహిళా దినోత్సవం

## -ముఖ్య అతిథి పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

మెదక్ జిల్లా (భారత శక్తి న్యూస్) మార్చ్ 11:



మెదక్ జిల్లా కలెక్టరేట్ (ఐ డి ఓ సి) లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు,నూతన కలెక్టర్ ప్రతిమ సింగ్ ను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు,ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా వారిరువురు చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ను సునీత లక్ష్మారెడ్డి కోరారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నర్సాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని వారు ఆకాంక్షించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకల్లో కలెక్టర్ ప్రతిమ సింగ్ అదనపు కలెక్టర్ నాగేష్ మున్సిపల్ చైర్ పర్సన్లు రాధిక,జ్యోతి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, తదిరులు హాజరై మహిళా గొప్పతనాన్ని చాటి చెప్పిన వివిధ శాఖల్లో ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులను ఈ సందర్భంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నది పుష్కరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో మార్చి 11(భారత శక్తి) రానున్న గోదావరి నది పుష్కరాలకు సంబంధించి జిల్లాలో ఏర్పాట్లపై భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచి పటిష్ట ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని వివరించారు. వివిధ శాఖల అధికారులతో వారి ఆధ్వర్యంలో చేపట్టబోయే పనుల గురించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డిఎంహెచ్వో రాజేందర్, వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు , ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం :

## ప్రధానోపాధ్యాయులు జి. రతన్ సింగ్

సూర్యాపేట, మార్చి 11(భారత శక్తి ): విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను, సామాజిక అవగాహనను పెంపొందించడం లక్ష్యంగానే 'స్వపరిపాలనా దినోత్సవం' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కుడ కుడ రోడ్ సూర్యాపేట ప్రధానోపాధ్యాయులు జి రతన్ సింగ్ అన్నారు. పాఠశాలలో నిర్వహించిన 'స్వపరిపాలనా దినోత్సవం' సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో ప్రార్థన నుండి తరగతుల నిర్వహణ వరకు అన్ని బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారని అన్నారు. డి.ఈ.వో., ఎం.ఈ.వో, ప్రధానోపాధ్యాయులు పాత్రల్లో కూడా విద్యార్థులు చక్కగా రాణించారని ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. భద్రు, పి. ప్రమీల, సిహెచ్. శంకర్, ఎస్. స్వప్న, ఎం. అనూజ పాల్గొన్నారు.

# త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవీఎం (ఏవీఎం) గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 11: ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ విక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి గోదాంలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.



సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు భద్రతా నిబంధనల అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాంలో ఉన్న రికార్డులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల సామగ్రి భద్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, ఎమ్మార్వో హిమబిందు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక.



భూపాలపల్లి జిల్లా (భారత శక్తి ) ప్రతినిధి మార్చి 11: రాష్ట్రంలో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మార్చి 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

హైదరాబాద్ నుండి సీఎస్ రామక్రిష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా మార్చి 12న నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి సంబంధించి విభాగాల వారీగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతి అధికారుల నుండి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు.

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత మరియు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త డ్రెయిన్ చివర సోక్పిట్ ఏర్పాటు పనులకు భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 11: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొని పరిశీలించారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాచారెడ్డి మండలంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, మురికి కాలువలు, వీధుల శుభ్రపరిచే పనులు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలను పరిశీలించారు.

అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కొత్త డ్రెయిన్ చివర సోక్పిట్ ఏర్పాటు పనులకు మార్కింగ్ కు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు.

ఈ పనికి సుమారు రూ. 92 వేల వ్యయం అంచనా వేయడం జరిగిందని,


గ్రామంలోని అయ్యవారి గుట్టం సమీపంలో ఉన్న పనికిరాని బోర్వెల్ను మూసివేయడం కూడా ఈ సందర్భంగా నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

99 రోజుల ప్రణాళికలో రోజు వారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిపిఓ మురళీ, డిఎల్ పిఓ శ్రీనివాస్, ఎమ్మార్వో, సరళ, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా 'పరాభవ' నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి11:

వరంగల్ భద్రకాళి దేవస్థాన, మదనానంద పీఠ ఆస్థాన సిద్ధాంతులు, దివంగత ఐనవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి, ప్రియ శిష్యులైన ఐనవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి, అయినవోలు సాయికృష్ణ శర్మ సిద్ధాంతులు రూపొందించిన 'పరాభవ' నామ సంవత్సర నూతన పంచాంగాన్ని వేదవ్యాస మహర్షి శిష్యుడైన సదానంద సరస్వతీ స్వామి స్థాపించిన సదానంద పీఠాధిపతులు, మదనానంద సరస్వతి పీఠాధిపతులు అయిన శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి చేతుల మీదుగా ఆవిష్కరణ చేయబడింది.

మంత్రులకు పంచాంగ సమర్పణ:పంచాంగ ఆవిష్కరణ అనంతరం, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి , అలాగే మాజీ రవాణా శాఖ మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి కి సిద్ధాంతులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మలు నూతన పంచాంగాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు గౌరీభట్ల నరసింహస్వామి ,తిగుల్ల కృష్ణమూర్తి శర్మ, తిగుళ్ళ సుధాకర్ శర్మ, రామ్మూర్తి శర్మ, గుండు లక్ష్మణ శర్మ, విశ్వనాథ శర్మ, మాధవ శర్మ, దేశపతి అనంత్ శర్మతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పురోహితులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ముధోల్ ఎఫ్ఏసీ ఎంపీడీవోగా వి. చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకారం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11 (భారత శక్తి): ముధోల్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వి. చంద్రశేఖర్ ఎఫ్ఏసీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో లవ కుమార్ శాఖాపరమైన 45 రోజుల శిక్షణకు వెళ్లడంతో, ప్రస్తుతం ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న వి. చంద్రశేఖర్కు పూర్తి అదనపు బాధ్యతలు (ఫుల్ అడిషనల్ ఛార్జ్) అప్పగించారు.



ఈ సందర్భంగా వి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజలు కలిసి సహకరించాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ల

# రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ క్రీడోత్సవాలు

## -ఎమ్మెల్యే జిఎంఆర్, గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి

పటాన్ చెరువు (భారత శక్తి న్యూస్) మార్చ్ 11:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా ఏర్పాటు చేసిన మహిళా క్రీడోత్సవాలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గూడెం యాదమ్మతో కలిసి స్వయంగా వీక్షించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పటాన్చెరు పట్టణం వేదికగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిత్యం కుటుంబ నిర్వహణ, ఉద్యోగం వంటి బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా ఉండే మహిళల కోసం క్రీడోత్సవాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈనెల 12వ తేదీ గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, డివిజన్ల పరిధిలోని మహిళలందరూ వేడుకల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రీడోత్సవాల్లో విజేతలుగా నిలిచిన వారందరికీ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, హారిక విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

# జీవ శాస్త్ర అధ్యయనం ద్వారా ఉజ్వల భవిష్యత్తు -నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.బి.సురేష్ కుమార్

నర్సాపూర్,భారత శక్తి న్యూస్) మార్చ్11:

తెలంగాణ రాష్ట్రం , ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సాపూర్ నుండి జీవశాస్త్ర విషయ నిపునిగా జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి ప్రాతినిథ్యం వహిస్తూ, ప్రతిష్టాత్మక విద్యాలయం ఐ.ఐ.టి మద్రాసు యందు బయోటెక్నాలజీ అంశాల్లో ఆధునిక బోధనా పద్ధతుల పై శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగించుకుని కళాశాలకు తిరిగి వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.హుస్సేన్ అధ్యాపకుణ్ణి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.హుస్సేన్ మాట్లాడుతూ జీవ శాస్త్ర అధ్యయనం ద్వారా అద్భుతమైన విద్య ఉద్యోగ అవకాశాలు కలవని సరిఅయిన పద్ధతిలో అభ్యసించడం ద్వారా జీవ శాస్త్ర డిగ్రీ విద్యార్థులు ప్రతిష్టాత్మక విద్యా సంస్థ అయిన ఐఐటీ మద్రాస్ లాంటి విద్యాలయాలలో పోస్టుగ్రాడ్యుయేషన్,ఆతరువాత పరిశోధనా రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆ దిశలో విద్యార్థులు నైపుణ్యాలను పొందాలని తెలిపారు,ఈశిక్షణ కార్యక్రమంలో పాల్గొనిన డా.బి.సురేష్ కుమార్ మాట్లాడుతూ జీవ శాస్త్ర అధ్యయనం ద్వారా జరుగుతున్న ఆధునిక ఆవిష్కరణలు,వైద్యరంగం లో ఎదురవుతున్న అనేక సమస్యలపై, పరిష్కారమార్గాలపై నేటి జీవశాస్త్ర విద్యార్థులు ఎలాంటి పరిశోధనలు కొనసాగించాలో తెలియజేస్తూ ఆరోగ్య భారతావని ఏర్పాటులో జీవ శాస్త్ర ప్రాధాన్యతను తెలియజేశారని తెలిపారు, ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.తిరుమల్ రెడ్డి,డా.నాగేందర్ పాల్గొనగా,కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నమీరా నజ్మీన్,ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఆదెప్ప,కళాశాల అధ్యాపక బృందం డా.అనిత,డా.రవికుమార్, డా.రమేష్,ఆరిఫ్, శ్రీనివాస్,హేమంత్ మహేందర్ రెడ్డి,బోధనేతర సిబ్బంది,ప్రిన్సిపాల్ శుభాకాంక్షలు తెలియజేశారు.



# రాబోయే ఏడాది జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం: జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి- తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 11:

2027 జనాభా లెక్కలు ప్రభుత్వ పథకాల అమలుకు కీలకం కావడంతో, అధికారులు పూర్తి అవగాహనతో, క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.జిల్లాలో జనాభా గణన--2027 సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా) గృహాల గణన మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు, రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని వివరించారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలు రూపొందించడానికి జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు.




ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు.అదే విధంగా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అందుబాటులో ఉంచనున్నట్లు స్పష్టం చేశారు.మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీటి సౌకర్యం, మురుగు నీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంట గది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు లాంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని వివరించారు.అనంతరం శిక్షణ నిర్వాహకులు, సీపీఓ కిషన్ నాయక్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు.అనంతరం జనాభా గణాంక అధికారులు యువేందర్ బాబు, రవీంద్ర నాయక్ ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసు, మాస్టర్ ట్రైనర్ రమేష్, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# రంజని గ్రామంలో ఉపాధి హామీ పనుల శుభారంభం ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి : ఏపీవో హరిలాల్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11 (భారత శక్తి) కుబీర్ మండలం, రంజని గ్రామంలో ఉపాధి హామీ పనుల శుభారంభాన్ని ఏపీవో హరిలాల్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను, కూలీలను మరింత ఉత్సాహపరచే విధంగా ఆయన పలు సూచనలను ఇచ్చారు.హరిలాల్ తెలిపారు, "జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధి హామీ పనులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ఇది వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం మాత్రమే కాదు, గ్రామ అభివృద్ధికి కూడా కీలక భాగం."పని ప్రదేశాల్లో కూలీలకు నీరు, భోజనం, వసతులు తదితర అవసరాలను పూర్తి స్థాయిలో కల్పించామన్నారు. ప్రతి పనికి సరైన పరికరాలు, భద్రతా ఏర్పాట్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.వేతనాల విషయంలో, "పనికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లిస్తాము. ఎలాంటి ఆలస్యం లేకుండా కూలీలు తక్షణమే వేతనాలను అందుకుంటారు," అని హరిలాల్ చెప్పారు.అంతేకాక, జాబ్ కార్డు లేని వారు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉందని గుర్తుచేశారు. వారు ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా జాబ్ కార్డు సులభంగా పొందవచ్చని సూచించారు.హరిలాల్ చివరగా, గ్రామ ప్రజలకు "ఉపాధి హామీ పథకం కేవలం ఉద్యోగం ఇవ్వడమే కాదు, గ్రామం అభివృద్ధికి, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయం కలిగించడానికి ఒక అవకాశమే" అని అన్నారు.



# నిర్మల్ జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11(భారత శక్తి) నిర్మల్ జిల్లా వెలమ సంఘం కొత్త అధ్యక్షుడిగా వర్దినేని శ్రీధర్ రావు గారి ఎంపికను పురస్కరించుకుని బుధవారం నిర్మల్ పట్టణంలోని ఇంద్రనగర్‌లో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య శ్రీధర్ రావు కి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్ రావు గారి ఎంపిక సంతోషకరమైన విషయమని, వెలమ సంఘం సంక్షేమం, అభివృద్ధికి ఆయన విశేషంగా కృషిచేసి ఖ్యాతి పొందాలని సూచించారు.

కార్యక్రమంలో నాయకులు ధర్మాజీ శ్రీనివాస్, కద్దాల్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ధర్మరాజు నరసయ్య పాల్గొని అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే రామారావు పటేల్ కు అంగన్వాడి టీచర్ల వినతి పత్రం.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11(భారత శక్తి)ముధోల్ తమ సమస్యలను పరిష్కరించాలనుకుని అంగన్వాడి ఉపాధ్యాయులు బుధవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. టీచర్లు, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూడాలని ఎమ్మెల్యేకు కోరారు.

వినతి పత్రంలో ముఖ్యంగా వారు బి.ఎల్.వో. డ్యూటీలు విధించకూడదని, ఈ విధంగా వృత్తిపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నారని పేర్కొన్నారు. అందుకోసం, వారు తమ వృత్తి పరమైన హక్కులను, ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది.ఇవి తప్పక, అంగన్వాడి ఉపాధ్యాయుల పలు ఇతర సమస్యలను కూడా పత్రంలో వివరించారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ టీచర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళవలన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో డీ. అనసూయ, ఎ. సంధ్యారాణి, ఎన్. సంతోషి, జి. సంధ్య తదితర అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంటింటికి ప్రభుత్వ పథకాలు అందాలి: బేరువాడ సర్పంచ్ విజయలక్ష్మి

మహబూబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 11 (భారత శక్తి ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేద కుటుంబాలకు అందేలా చూడాలని బెరువాడ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కేసముద్రం మండలం బెరువాడ గ్రామంలో ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను పనితీరు పిల్లల పోషణ మహిళలు బాలల సంక్షేమానికి సంబంధించి తదితర అంశాల మీద సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఆర్ విజయ పంచాయతీ సెక్రెటరీ రఘువీర్ అంగన్వాడి టీచర్ బండారి అశోక సుమలత తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి.

## -మహిళలు అన్ని రంగాల్లో ముందంజ

## -జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 11(భారత శక్తి )నిజమైన మహిళా సాధికారత ఇంటి నుంచే ప్రారంభమవుతుందని మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక, రెవెన్యు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తోన్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యవస్థను విస్తరించడంతో పాటు మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటూ, తల్లులు, శిశువుల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. పాఠశాలలో బాలికలను ప్రశ్నలు అడగడానికి, పోటీపడడానికి, నాయకత్వం వహించడానికి ప్రోత్సహించినప్పుడు అది ప్రారంభమవుతుందని, అలాగే సమాజంలో మహిళల భద్రత కేవలం వారి సమస్యగా మాత్రమే కాకుండా అందరి బాధ్యతగా భావించినప్పుడు అది నిజంగా ఆచరణలోకి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా టీఎన్జీవో అధ్యక్షులు శ్రీనివాస్ గారు, డి.పి.ఆర్.ఓ శ్రీ రాజేంద్రప్రసాద్ గారు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీమతి రజిత గారు పాల్గొన్నారు. ఐసిడిఎస్ సీడీపీఓలు, సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, సఖి సిబ్బంది, ఇతర జిల్లా కార్యాలయు సిబ్బంది పాల్గొన్నారు. మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.150 టికెట్ ధరలతోనే రూ.50 కోట్లు.. ఇదే అసలైన విజయం

పెళ్లిరోజు నుంచే ఆర్థిక లావాదేవీలన్నింటినీ తన భార్య ఆర్తినే చూసుకుంటున్నారని, అందుకు గర్వంగా ఉందని నటుడు శివ కార్తికేయన్ పేర్కొన్నారు. తన బ్యాంకు ఖాతాలో డబ్బు ఎంత ఉందో తనకు తెలియదని, సినిమా టికెట్టుకూ సతీమణినే మనీ అడుగుతానని తెలిపారు. తాను నిర్మించిన కొత్త సినిమా 'తాయ్ కిళవి' సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ చిత్రం మహిళలకు అంకితమన్నారు. ''తాయ్ కిళవి' కథను రెండు సార్లు విన్నాను, చదివాను. రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఇందులోని సన్నివేశాలను చెక్ చేసేవాడిని. పూర్తిగా 12 సార్లు ఈ చిత్రాన్ని చూశా. ఇకపై నేను నటించే సినిమాలకూ ఇలాగే వ్యవహరించాలనుకుంటున్నా. ఇలా చేసినంత మాత్రాన మూవీ బ్లాక్‌బస్టర్ అయిపోతుందా? అని మీరు అడగొచ్చు. హిట్, ఫ్లాప్ అనేవి నా చేతుల్లో లేని అంశాలు. కానీ, పక్కా ప్లానింగ్ ఉంటే నిర్మాతకు ఖర్చు తగ్గుతుంది. దానితో మరో సినిమా చేయొచ్చు. ఈ చిత్రం చూశాక దర్శకుడు శివకుమార్ తండ్రి.. అతడిని, నన్ను హగ్ చేసుకుని ఎమోషనల్ అయ్యారు. ఆ క్షణం మా నాన్న గుర్తొచ్చారు. ఆయన నా సక్సెస్‌ను చూస్తున్నారనిపించింది'' అని పేర్కొన్నారు. ఇందులో వృద్ధురాలి పాత్ర పోషించారు రాధిక. సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన రాధికా శరత్‌కుమార్ మాట్లాడుతూ.. ''కొందరు అగ్ర హీరోల సినిమాల టికెట్లను రూ.1500/రూ.2000కు విక్రయిస్తుంటారు. కానీ, రూ.150 టికెట్ ధరలతోనే ఈ సినిమా రూ.50 కోట్లకుపైగా వసూలు చేసింది. ఇదే అసలైన విజయం అని అనుకుంటున్నా'' అని అన్నారు. ఈ కామెడీ డ్రామా మూవీ తమిళంలో ఫిబ్రవరి 27న విడుదలైంది.



## మీ చెడు ఆలోచనలను మీతోనే ఉంచుకోండి

: రవి మోహన్



తనపై వచ్చిన ట్రోల్స్‌పై కోలీవుడ్ నటుడు రవి మోహన్ (జయం రవి) స్పందించారు. మహిళలే కరెక్ట్ అని చాలా మంది అనుకుంటారని, కానీ అసలైన బాధితులు పురుషులే అని పేర్కొన్నారు. ''ప్రేమించిన వారి కోసం నేను ఏం చేశానన్నది ఏదో ఒక రోజు మీకు తెలుస్తుంది. నన్ను ఇలా బతకనివ్వండి. మీ చెడు ఆలోచనలను మీతోనే ఉంచుకోండి'' అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తన భార్య ఆర్తి నుంచి విడాకులు తీసుకున్నట్లు రవి మోహన్ 2024లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే.. గాయని కెనీషాతో ఆయన రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ రూమర్స్ వచ్చాయి. రవి మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఓ కొత్త సినిమా ప్రారంభోత్సవానికి కెనీషా హాజరయ్యారు. ఆ వేడుకలో తాము కలిసి దిగిన ఫొటోలను నటుడు కొన్ని రోజుల క్రితం షేర్ చేశారు. దీంతో, ఆయన వైఖరిని వ్యతిరేకిస్తూ కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే రవి మోహన్ రియాక్ట్ అయ్యారు. 'పరాశక్తి'లోని ఓ కీలక పాత్రతో ప్రేక్షకులను ఇటీవల పలకరించారు రవి మోహన్. ప్రస్తుతం 'బ్రో కోడ్'లో నటిస్తున్నారు. యోగిబాబు హీరోగా 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికి నిర్మాత కూడా ఆయనే.

## మహేశ్ అభిమానులకు హరీశ్ శంకర్ క్షమాపణలు



ఒక సినిమా హిట్ కావాలంటే అందరి హీరోల అభిమానుల మద్దతు ఉండాలని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ అభిమానికి ఇచ్చిన రిప్లైపై వివరణ ఇస్తూ మహేశ్ ఫ్యాన్స్‌కు సారీ చెప్పారు. పని ఒత్తిడిలో ఉన్నందున ఆ అభిమాని పోస్ట్ పూర్తిగా చదవకుండా రిప్లై ఇచ్చినట్లు చెప్పారు. ''కొన్ని రోజులుగా పని ఒత్తిడిలో ఉన్నాను. సెన్సార్ పనులు, అనంతరం బోర్డు అధికారులతో సమావేశం, పెద్దమ్మ తల్లి దర్శనం, పోస్ట్ ప్రొడక్షన్ పనులు, సాంగ్ ప్రోమో ఫైనల్ చెక్ చేయడం.. ఇలా ఎంతో బిజీగా ఉన్నాను. ఈ బిజీ షెడ్యూల్ మధ్యలో సినిమా ప్రోమోపై వస్తున్న స్పందనలకు కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో రిప్లైలు ఇస్తున్నాను. ఆ హడావిడిలో ఒక ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే పొరపాటున కోట్ చేశా. వెంటనే నా టీమ్ అప్రమత్తం చేయడంతో పొరపాటును గ్రహించి నిమిషం వ్యవధిలోనే ఆ రిప్లై తొలగించాను'' ''సూపర్‌స్టార్ మహేశ్‌బాబు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. 'వారణాసి' చిత్రంతో ఆయన మరెన్నో రికార్డులు సృష్టిస్తారని నమ్ముతున్నా. గతంలో 'పోకిరి' గురించి నేను పెట్టిన పోస్ట్‌లను చూస్తే మహేశ్‌పై నాకున్న అభిమానం అర్థమవుతుంది.

## నటి హన్సికకు విడాకులు.. రెండేళ్లకే ముగిసిన వివాహ బంధం



ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వానీ తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. వ్యాపారవేత్త సోహైల్ ఖతురియాతో ఆమె అధికారికంగా విడాకులు తీసుకున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ విడిపోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. దీంతో వారి రెండేళ్ల వివాహ బంధం ముగిసినట్లయింది. 2022 డిసెంబర్‌లో హన్సిక, సోహైల్ వివాహం రాజస్థాన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. అయితే, పెళ్లయిన కొద్ది కాలానికే ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయని ప్రచారం మొదలైంది. సోషల్ మీడియా ఖాతాల నుంచి హన్సిక తన పెళ్లి ఫొటోలను తొలగించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది.

# సినిమా

## అంతకు మించి





పవన్ కల్యాణ్‌హీరోగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఉగాది సందర్భంగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకోగా ఎలాంటి కట్స్ లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మూవీ రన్ టైమ్ 2 గంటల 34 నిమిషాలుగా నిర్ణయించారు. పవన్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం ఇప్పటికే పాటలు, పోస్టర్లతో అంచనాలు పెంచేసిన దర్శకుడు తాజాగా ఓ కామెంట్‌తో వాటిని రెట్టింపు చేశాడు. ఈ మూవీ ఇంటర్వెల్ సీన్ గురించి మాట్లాడిన హరీశ్ శంకర్.. పవన్‌కెరీర్‌లోనే ఇది బెస్ట్ ఇంటర్వెల్ సీన్ అవుతుందని చెప్పాడు. గతంలో గబ్బర్ సింగ్ లో పవన్ ను చూపించిన తీరు ఒక ఎత్తయితే.. ఇందులో అంతకు మించి ఉంటుందని హింట్ ఇచ్చాడు.



## రిలీజ్ డేట్ పై క్లారిటీ

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా నటిస్తున్న కరుప్పు చిత్రం గురించి సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. దర్శకుడికి, నిర్మాతకు మధ్య విభేదాలు తలెత్తాయని.. అందుకే రిలీజ్‌లో జాప్యం అంటూ వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దర్శకుడు ఆర్జే బాలాజీ దీనిపై క్లారిటీ ఇచ్చాడు. మూవీ ఎలాంటి చిక్కుల్లో లేదని పేర్కొంటూ ఒక వీడియో విడుదల చేశాడు. సినిమా ఆలస్యం కారణంగా అభిమానులు నిరాశ పడుతున్నట్లు తనకు అర్థం అవుతుందని, వారి నిరీక్షణకు తగిన ఫలితం ఉంటుందని చెప్పాడు. ఏప్రిల్ 10న ఈ సినిమా రిలీజ్ కావడం లేదని స్పష్టం చేశాడు. పది రోజుల్లో విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపాడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న ఈ మూవీ ఒక పవర్ ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో సూర్య సరసన త్రిష నటిస్తుండగా, ఇంద్రాన్స్, నట్టి, స్వాసిక, శివద వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అప్పటిదాకా ఆగలేను

మేధా శంకర్.. తెలుగు ఫ్యాన్స్‌కి పెద్దగా తెలీదు కానీ బాలీవుడ్‌లో మాత్రం ఒక్క చిత్రంతో ఓవర్‌నైట్‌స్టార్ అయిపోయింది. '12th ఫెయిల్' చిత్రంలో మెస్మరైజింగ్ యాక్టింగ్‌తో అదరగొట్టేసింది. అంతకు ముందు షార్ట్ ఫిలిమ్స్ ద్వారా గుర్తింపు తెచ్చుకొని ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు బుల్లితెరపై కూడా మెరిసింది. ఇక మేధా బాలీవుడ్‌లో లేటెస్టుగా నటించిన రొమాంటిక్ కామెడీ సీక్వెల్ గిన్నీ వెడ్స్‌సన్నీ-2. ప్రశాంత్ ఝా దర్శకత్వం వహించిన ఈ మూవీలో అవినాష్ తివారీ లీడ్‌రోల్‌లో నటించాడు. ఏప్రిల్ 24న ఈ చిత్రం రిలీజ్ కానున్న నేపథ్యంలో మేకర్స్ ఇప్పటికే ప్రమోషన్స్‌స్పీడప్ చేశారు. ఇక సినిమాల సంగతి ఎలా ఉన్నా సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లోనే ఉంటూ అలరిస్తూ ఉంటుంది మేధా శంకర్. తాజాగా గ్రీన్‌లెహంగాలో అందాలు ఆరబోసింది. పొడవాటి ఉంగరాల జుట్టు, గోల్డ్‌ఎంబ్రాయిడరీ, జుమ్కాలు, గాజులు, స్టేట్‌మెంట్ చోకర్‌తో స్టన్నింగ్‌పోజు ఇచ్చింది. ఇన్‌స్టా వేదికగా పిక్స్ షేర్ చేస్తూ 'జిన్నీ తన పెళ్లి కోసం చాలా ఉత్సాహంగా ఉంది! మీరు కూడానా? మా సినిమా 'జిన్నీ వెడ్స్ సన్నీ2' ఏప్రిల్ 24న థియేటర్లలో విడుదల కాబోతుంది. అయితే మీరందరూ చేసే దాకా నేను వేచి ఉండలేను' అంటూ పోస్ట్ చేసింది. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



**అబుదాబి... అరబ్ దేశాల్లోని ప్రముఖ సంపన్న నగరం. ఆకాశాన్ని తాకే హర్మ్యాలూ పెద్దపెద్ద కోటలూ... చెప్పాలంటే అదో ప్రత్యేకమైన ప్రపంచం. అలాంటి చోట అబ్బురపరిచేలా నిర్మించిన ఆధ్యాత్మిక ధామమే బీఏపీఎస్ స్వామి నారాయణ్ మందిర్. సాంస్కృతిక - సామాజిక - ఆధ్యాత్మిక భావనలు ప్రతిబింబించేలా... ఐక్యత, మతసామరస్యాలకు ప్రతీకగా నిలుస్తున్న ఈ మందిరం... పశ్చిమ ఆసియాలోనే పెద్దది. ఎన్నో విశేషాలకూ నెలవైన ఈ సన్నిధానం నిర్మాణం ఆద్యంతం ఆసక్తికరం, నయనానందకరం.**



# అబుదాబిలో అతి పెద్ద ఆలయం!


స్వామి నారాయణ్ మందిర్... ప్రపంచవ్యాప్తంగా 1300లకు పైగా ఈ ఆలయాలు ఉంటే... వాటన్నింట్లోకి అబుదాబిలోని మందిరం ఇప్పుడు ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. బోచా సన్యాసి అక్షర్ పురుషోత్తమ్ స్వామి నారాయణ్ సంస్థ (బీఏపీఎస్) సౌజన్యంతో రూపొందించిన ఈ అత్యద్భుత కట్టడం అద్వితీయ శిల్పకళా వైభవానికి తార్కాణం. పురాణ ఇతిహాసాలను కళ్లకు కట్టే చిత్ర మాలికలూ, ఎందరో మహర్షుల శిల్పాలూ, ధ్యానకేంద్రాలూ, భక్తికి సంబంధించిన విశేషాలను పంచుకునే వేదికలూ... ఇలా ఎన్నెన్నో విశేషాలు కనిపిస్తాయిక్కడ.

### నిర్మాణం మొదలైందిలా...

భగవంతుని స్వరూపంగా భావించే స్వామి నారాయణ్ పరంపరను కొనసాగించేందుకే బీఏపీఎస్ అందుబాటులోకి వచ్చింది. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే దేశవిదేశాల్లో స్వామి నారాయణ్ ఆలయాలను నిర్మించారు. ప్రస్తుతం ఈ పరంపరకు ప్రతినిధిగా కొనసాగుతున్న మహంత్ స్వామి మహారాజ్ ఆలోచనతో ఈ ఆలయ నిర్మాణం పూర్తిచేసుకున్నా... ప్రముఖ్ స్వామి మహారాజ్ హయాంలోనే శ్రీకారం చుట్టారు. ఎలాగంటే... 1997లో ఆయన ఈ నగరానికి వచ్చినప్పుడు ఇక్కడ కూడా ఆలయాన్ని నిర్మిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారట. అదే విషయాన్ని అరబ్ ప్రభుత్వానికి తెలియజేస్తూ అనుమతి కోరితే... 2015లో దుబాయ్ రాజు షేక్ మొహమ్మద్ జాయెద్ అల్ నహ్యాన్ ఆమోదిస్తూ 27 ఎకరాల స్థలాన్ని కూడా మంజూరు చేశారట. అలా 2019లో ఆలయ నిర్మాణం ప్రారంభమై 2024లో పూర్తయ్యింది.

### ఆకట్టుకునే నిర్మాణంతో...

ప్రపంచంలోని అతి పెద్ద స్వామి నారాయణ్ మందిరాల్లో ఇదీ ఒకటిగా ఘనత సాధించడమే ఈ ఆలయం



ప్రత్యేకత అనుకుంటే పొరబడినట్లే. ఆకట్టుకునే నిర్మాణశైలితో విరాజిల్లే ఈ మందిరం 108 అడుగుల ఎత్తు, 262 అడుగుల పొడవు, 180 అడుగుల వెడల్పులో ఓ పెద్ద కోట మాదిరి కనిపిస్తుంది. ఆలయానికి వెళ్లే మార్గంలోనే త్రివేణీ సంగమాన్ని తలపించేలా కొలనులు ఉంటాయి. ఈ మందిరం మొత్తం దాదాపు 402 స్తంభాలు ఉన్నాయి. వాటన్నింటిపైనా మహర్షులనూ, ఆధ్యాత్మికవేత్తలనూ, దేవతామూర్తులనూ కళ్లకు కట్టినట్లుగా చెక్కారు. అంతేనా.. రామాయణం, మహాభారతం, శివపురాణం, భాగవతాల్లోని కథలనూ ఈ స్తంభాలపైన అత్యద్భుతంగా ఆవిష్కరించారు. ఇంకా... దుబాయ్ జీవనశైలిని తెలియజేసేలా ఒంటెలు, గుర్రాలు, ఏనుగుల బొమ్మలనూ ఇక్కడ చూడొచ్చు. అలాగే... స్వామినారాయణ్, గుణాతీతానంద మహారాజ్ మూర్తులతోపాటు రాధాకృష్ణులూ, హనుమాన్ సహిత సీతారామలక్ష్మణులూ, కార్తికేయుడూ వినాయకుడూ శివపార్వతులూ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి, సుభద్రబలభద్రపూరీ జగన్నాథుడూ, పద్దెనిమిది మెట్లపైన కనిపించే అయ్యప్పనూ దర్శించుకోవచ్చు. ఆ తరువాత ప్రార్థనా మందిరాలు, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, ఫుడ్‌కోర్ట్, గిఫ్ట్‌షాప్.. ఇలా ఒకటేమిటి, ఏకంగా ఓ ఆధ్యాత్మిక నగరంలో ఉన్నట్లుగా అనిపిస్తుంది.

### భూకంపాన్ని హెచ్చరించేలా...

ఈ మందిరాన్ని నిర్మించేముందు డిజైనర్ల బృందం భారత్‌లోని పలు ఆలయాలనూ, ప్రముఖ కట్టడాలనూ పరిశీలించింది. అలాగే ఇక్కడ అరబ్‌లోని ఏడు ఎమిరేట్స్‌కు సంకేతంగా ఏడు గోపురాలూ, 3డి ప్రింటింగ్‌లో కట్టిన వాల్ ఆఫ్ హార్మొనీ భక్తుల్ని





ఆకట్టుకుంటాయి. ఆలయం లోపలా 402 స్తంభాలు ఉన్నా ఏ రెండూ ఒకేలా కనిపించవు. దీని నిర్మాణంలో పాలరాయి, పింక్‌శాండ్‌స్టోన్‌లనే వినియోగించారు. పింక్‌శాండ్‌స్టోన్‌ను రాజస్థాన్ నుంచీ పాలరాయిని ఇటలీ నుంచీ తెప్పించారు. ఈ మందిరం నిర్మాణంలో దాదాపు ఇరవై వేల టన్నుల పాలరాయినీ, పింక్‌శాండ్‌స్టోన్‌నీ ఉపయోగించారు. ఇక్కడి స్తంభాలపైన కనిపించే శిల్పాలను రాజస్థాన్‌కు చెందిన కళాకారులు చెక్కారట. అంతేనా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఫ్లైయాష్‌ను ఎంచుకున్నారు. సిమెంటు వినియోగాన్నీ తగ్గించారట. మందిరాన్ని నిర్మిస్తున్నప్పుడూ ఆ తరువాతా ఆలయంలో సుమారు నాలుగువందల సెన్సర్లను ఏర్పాటు చేశారు. ఇవి భూకంపాలతోపాటు, వాతావరణ మార్పులనూ గుర్తించి, అప్రమత్తం చేస్తాయి. అన్నట్టు... ఈ మందిరం నిర్మాణంలో కాంక్రీటు, స్టీలును అస్సలు ఉపయోగించలేదు. ఇవి కాకుండా...


* వేంకటేశ్వరస్వామి, పద్మావతి, లక్ష్మీదేవిల విగ్రహాల తయారీ కోసం తిరుపతి నుంచి ప్రత్యేకంగా శిల్పులు వచ్చారట.
* మిగతా దేవతామూర్తుల విగ్రహాలను పాలరాతితో చెక్కినా... అయ్యప్ప విగ్రహాన్ని మాత్రం పంచలోహాలతో కేరళకు చెందిన కళాకారులే తయారుచేశారట.

ఈ ఆలయ నిర్మాణంలో పలు దేశాలకు చెందిన వందలమంది వలంటీర్లు పాల్గొని ఉడతాభక్తిగా సాయం అందించారు. వీళ్లలో వ్యాపారవేత్తలూ, సివిల్ ఇంజినీర్లూ, డిజైనర్లూ, రాజకీయ నాయకులూ... అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్ వంటి నటులూ... ఉండటం గమనార్హం.

### నమోదు తప్పనిసరి...

దుబాయ్ అబుదాబీ షేక్ జాయెద్ హైవేపైన దాదాపు ఏడువందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ మందిరం సోమవారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో తెరిచే ఉంటుంది. భక్తులు ఈ ఆలయాన్ని చూడాలనుకుంటే ముందుగా పేరు నమోదు చేయించుకోవాలి. ఒకేసారి దాదాపు పదివేలమంది పట్టేలా రూపొందించిన ఈ మందిరంలో సాయంత్రాలు ఇచ్చే గంగా హారతిని చూసి తీరాల్సిందేనన్నది భక్తులు ముక్తకంఠంతో చెబుతున్నమాట.





# ప్రతీ మహిళ సమాజంలో ఆర్థికంగా, గౌరవంగా బ్రతకాలి..

* **మహిళలందరి ముఖంలో చిరునవ్వులుండాలి..**
* **ఆర్ఆర్డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**

ఎల్బీనగర్, మార్చి 11 (భారత శక్తి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని గౌడ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవా రంగంలో అంకితభావంతో పనిచేస్తున్న మహిళలకృషిని గుర్తిస్తూ మహిళా పోలీసులను, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులను శాలువాలు కప్పి సన్మానించారు. సమాజ శ్రేయస్సు కోసం వారు నిర్విరామంగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందిస్తూ, వారి సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక సాధికారత కుటుంబానికి వెలుగు దీపిక వంటిదని, సమాజంలో స్త్రీలు గౌరవంగా జీవించాలంటే విద్యా, ఉపాధి రంగాలలో వారు ముందుకు రావాలని పేర్కొన్నారు. స్త్రీ శక్తి సమాజానికి బలం అని, స్త్రీ సాధికారతే అభివృద్ధికి మార్గమని ఆయన అన్నారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను లక్ష్యంగా తీసుకుని ఆడబిడ్డల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేసి 140కి పైగా స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన గ్రామీణ కుటీర పరిశ్రమల ఉత్పత్తులను మధ్యవర్తులు లేకుండా నేరుగా



వినియోగదారులకు విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే గడిచిన రెండున్నరేళ్లలో డ్వాక్రా మహిళా సంఘాలకు సుమారు 23 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేసే లక్ష్యంతో మహిళా సంఘాలను పెద్ద వ్యాపారాల్లోకి తీసుకురావడానికి పెట్రోలు బంకులు, బస్సులు, డైరీ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రత్యేక మహిళా బజార్లు వంటి పలు కార్యక్రమాల ద్వారా వారికి ఆదాయం పెరిగే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమని కొనియాడారు. విద్యా రంగంలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. ఎంతో మంది మహిళలు ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సర్వీసుల్లో చేరి దేశానికి సేవలందిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రతి మహిళ ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుస్మిత మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీ ప్రసన్న గౌడ్, బద్దుల వేణుగోపాల్ యాదవ్, దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి తులసి శ్రీనివాస్, బబ్బూరి ఆనంద్ గౌడ్ , బేర బాలకిషన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, నాయకులు కోటగిరి శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాలు వసంత, మహిళా పోలీసులు, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.




## ఇక్కడ మాకు పోలీస్ స్టేషన్ వద్దని కాలనీవాసుల ఆందోళన

ఎల్బీనగర్, మార్చి 11 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్ కాలనీలోని మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్ పోలీస్ స్టేషన్ కి ఇవ్వమని కాలనీవాసులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కాలనీవాసుల వినతిమేరకు బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రభాత్ నగర్ చేరుకొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో టీమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో పోలీస్ స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్, పార్క్ స్థలం కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ని కోరడంతో వారు వెంటనే సానుకూలంగా స్పందించి వెంటనే మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఈ స్థలం ఇప్పుడు ఇచ్చే అవకాశం లేదని తెలియజేసిన నేపథ్యంలో ప్రభాత్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ పోలీస్ స్టేషన్ కోసం అడుగుతున్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో స్థానిక రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ని కలిసి పోలీస్ స్టేషన్ కు ఇచ్చే ప్రయత్నం విరమించుకోవాలని కోరడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నరసింహ గుప్త, విట్టల్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రభాత్ నగర్ కాలనీ అధ్యక్షులు బాల్ రెడ్డి, గట్టు శ్రీను, రమణారెడ్డి, రామారావు, రాజేష్, నాగేందర్, బాలరాజు, విద్యా సాగర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనతోనే అభివృద్ధికి మార్గం

* **క్షేత్రస్థాయిలో వాస్తవ గణాంకాలు ప్రతిబింబించాలి**
* **ప్రణాళికల రూపకల్పనలో సెన్సస్ డేటా కీలకం**
* **తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న భారీ కసరత్తు**
* **అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం**

హైదరాబాద్ , మార్చి 11 (భారత శక్తి): దేశ భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో జనాభా గణన అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. 2027 జనగణనను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఉన్న జనాభా వివరాలు ఉన్నది ఉన్నట్లుగా నివేదికల్లో ప్రతిబింబించాలని ఆమె స్పష్టం చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఛార్జ్ సెన్సస్ ఆఫీసర్లు, అదనపు ఆఫీసర్లకు 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' (HLO) పై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

### రెండు దశల్లో ప్రక్రియ


జనగణన ప్రక్రియ ప్రధానంగా రెండు దశల్లో సాగుతుందని భారతి హోళికేరి వివరించారు:

మొదటి దశ: ఇళ్ల జాబితా సేకరణ, గృహ గణన. ఇందులో ఇంటి స్థితిగతులు, అందులోని సౌకర్యాల సమాచారాన్ని సేకరిస్తారు.

రెండో దశ: జనాభా గణన. ఇందులో ప్రతి వ్యక్తి సామాజిక, ఆర్థిక వివరాలను నమోదు చేస్తారు.

మొదటి దశను ఎంత పకడ్బందీగా పూర్తి చేస్తే, రెండో దశ అంత సులభంగా






మరియు ఖచ్చితత్వంతో సాగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి సెన్సస్ కావడంతో, దీనిని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సాంకేతికతకు పెద్దపీట:

మారుతున్న కాలానికి అనుగుణంగా ఈసారి సర్వేలో డిజిటల్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పొరపాట్లు చేయకుండా ఉండేందుకు వీలుగా వారికి ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వాలని డైరెక్టర్ సూచించారు. ఏ ఒక్క ఇల్లు లేదా కుటుంబం సర్వేలో మిస్ కాకూడదని, డూప్లికేషన్ (పునరావృతం) లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.

* **ఒక్క కుటుంబం కూడా మిస్ కావొద్దు: కమిషనర్**

ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. నగర పరిధిలోని ప్రతి ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ప్రతి ఇంటిని సందర్శించి నాణ్యమైన సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పథకాల రూపకల్పనకు ఈ డేటానే ఆధారమని ఆయన గుర్తు చేశారు. సమగ్రమైన, ఖచ్చితమైన సమాచార సేకరణ ద్వారానే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకళ, మాస్టర్ ట్రైనర్లు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## బడంగ్‌పేట్‌లో పారిశుధ్య పనుల పరిశీలన


మీర్పేట్, మార్చి 11 (భారత శక్తి): డంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలో 'ప్రజా పాలన ప్రగతి'లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో పారిశుధ్య పనులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. మీర్పేట్ చౌరస్తా వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఆమె, పారిశుధ్య కార్మికులు, స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాయత్రి నగర్ చౌరస్తా వద్ద పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పట్టణంలో పరిశుభ్రతను మెరుగుపరచడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సరస్వతి, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) అభినయ్ కుమార్, ఏఈ గంగాప్రసాద్, గ్రూప్ 1 ట్రైనీ ఆఫీసర్ సాయి యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నర్సింహా, వి. యాదగిరి, ఎస్ఎఫ్ఏలు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు.




## జనామోదమైన కథనాలకు ప్రతీక భారత్ శక్తి పత్రిక

* **జవహర్ నగర్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్.**

జవహర్ నగర్ , మార్చి 11 (భారత శక్తి): నికార్సైన జర్నలిజానికి చిరునామాగా భారత్ శక్తి పత్రిక నిలుస్తుందని, జనామోదమైన కథనాలకు, రచనలకు భారత్ శక్తి ఒక జనామోదం లాగా పరిగణించబడుతుందని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జవహర్ నగర్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు భాషవోని కొండల్ ముదిరాజ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నికార్సైన జర్నలిజానికి చిరునామాగా మారిన భారత్



శక్తి పత్రిక 2026 క్యాలెండర్ ను బుధవారం బాలాజీ నగర్ లోని తన కార్యాలయంలో జవహర్ నగర్ పుర ప్రముఖులు సీనియర్ నాయకుల మధ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరియు పత్రిక సోదరులు పాల్గొన్నారు.

# సెస్ ఉద్యోగుల విధుల బహిష్కరణ...

* **72 గంటల సమ్మెతో హోరెత్తిన సిరిసిల్ల.**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 11(భారత శక్తి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) ఉద్యోగులు, కార్మికులు సమరశంఖం పూరించారు. 72 గంటల పాటు విధుల బహిష్కరణకు పిలుపునివ్వడంతో జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (CITU) ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నేతలు మాట్లాడుతూ...సెస్ పరిధిలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్లు (VEW)గా పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలిచ్చినప్పటికీ, వారిని ఇప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరితో పాటు మరికొన్ని కీలక డిమాండ్లను యాజమాన్యం



ముందు ఉంచారు. గతంలో అమల్లో ఉన్న ఫిక్స్‌డ్ ట్రావెలింగ్ అలవెన్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలి. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి నాణ్యమైన రక్షణ పరికరాలు (Safety Gear) అందించాలి. అసిస్టెంట్ హెల్పర్ అనే పదవి పేరును జూనియర్ లైన్‌మెన్ (JLM)గా మార్చాలి. పెండింగ్‌లో ఉన్న 2025 వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లను విడుదల చేయాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి పాల్గొని మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు కర్నాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లారెడ్డి, నాయకులు మల్లేశం, రాంబాబు, పిట్టల మల్లేష్, శ్రీనివాస్, కిషన్, అంజిరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాజమాన్యం మొండివైఖరి వీడకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

ఢిల్లీ, మార్చి 11(భారత శక్తి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్ జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు. అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం... కేంద్రం కీలక ప్రకటన

ఢిల్లీ, మార్చి 11(భారత శక్తి): పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లో వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని తెలిపింది. ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్, ముడి చమురు, వంట గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన అవసరం లేదని తెలిపింది. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగా సాగేలా చూడాలని సూచించింది. దేశీయ అవసరాలకు కావాల్సిన ముడి చమురులో 75 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధికి సంబంధం లేని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీలు, చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది. గ్లోబల్ షిప్పింగ్ మార్గాల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు దిగుమతులు నిరంతరాయంగా అందుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌కు చమురు తీసుకువచ్చే అదనపు కార్గో షిప్‌లు కూడా వస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నప్పటికీ మన దేశంలో ఇంధన అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

### అధికారంలోకి వచ్చాక అదృశ్యం..
## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై మిస్టరీ!

మార్చి 11: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఆచూకీపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారి కూడా ప్రజల ముందుకు రాకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొనసాగుతున్న యుద్ధంలో ఆయన గాయపడ్డారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ఆయన పరిస్థితిపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. సోమవారం ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ మొజ్తబా గాయపడినట్లు అంగీకరించింది. ఆయన్ను "జాన్‌బాజ్ ఆఫ్ రంజాన్" (గాయపడిన యుద్ధ వీరుడు) అని అభివర్ణించింది. అయితే, ఈ గాయం ఎప్పుడు, ఎక్కడ, ఎలా తగిలింది, దాని తీవ్రత ఎంత అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ గాయం కారణంగా ఆయన తన అధికారిక బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారా? లేదా? అనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో మిస్టరీ మరింత పెరిగింది. జెరూసలేం పోస్ట్ తన కథనం ప్రకారం అంతర్గత వర్గాల సమాచారం మేరకు మొజ్తబా యుద్ధంలో గాయపడింది నిజమే అయినప్పటికీ, ఆయన దేశ వ్యవహారాలను చక్కదిద్దే స్థితిలోనే ఉన్నారని తెలుస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ మార్పు సజావుగా జరిగిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు మొజ్తబాకు సంబంధించిన ఒక్క కొత్త ఫొటో గానీ, వీడియో గానీ విడుదల కాలేదు. ప్రభుత్వ ఛానళ్లు ఆయన పాత ఫుటేజ్‌ను, కొన్ని సందర్భాల్లో ఏఐ జెనరేటెడ్ చిత్రాలను ఉపయోగించి అంతా సవ్యంగా ఉందని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై ఇరాన్ ప్రభుత్వ వ్యతిరేకులు, పరిశీలకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొజ్తబా ప్రజల ముందుకు రాకపోవడం వెనుక బలమైన కారణం ఉందని వారు అనుమానిస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు ఆయన గాయాలతో మరణించి ఉండవచ్చని కూడా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం దేశాన్ని నడిపిస్తున్నది ఎవరు? తెర వెనుక నిజమైన అధికారం ఎవరి చేతిలో ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొజ్తబాను కేవలం ఒక ఉత్సవ విగ్రహంగా ఉంచి, పాలనా వ్యవస్థలోని మరో సీనియర్ అధికారి అధికారాన్ని చెలాయిస్తున్నారని ప్రతిపక్ష వర్గాలు ఆరోపిస్తున్నాయి. దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలను శాసించిన సుప్రీం లీడర్ అలీ ఖమేనీ కుమారుడే ఈ మొజ్తబా ఖమేనీ. ఆయనకు అధికారిక పదవులు లేనప్పటికీ, తెరవెనుక దేశ రాజకీయ, భద్రతా వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని విశ్లేషకులు భావిస్తారు.

## ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు..

అమరావతి, మార్చి 11(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది కానుకగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.50 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈ రోజు సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు, పథకాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయని.. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని, పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను మరింత తగ్గిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రూఅప్ పేరిట ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపారని చంద్రబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక ట్రూడౌన్ చేశామని, విద్యుత్ చార్జీల భారం మరింత తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## మధ్య ప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధం: బాగ్దాద్ విమానాశ్రయంపై డ్రోన్ దాడి

మార్చి 11 : ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం (BDSC)పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం. బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణి ఛత్రాన్ని విప్పింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. అలాగే, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి. యుద్ధం ఆపకపోతే గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (IRGC) హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిలో మైన్లను (మందుపాతరలు) అమర్చి షిప్పింగ్‌ను నిలిపివేసేందుకు ఇరాన్ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఒకవేళ చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటే, ఎన్నడూ చూడని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. చమురు మార్గంలో మైన్లను అమర్చేందుకు సిద్ధంగా ఉన్న ఇరాన్‌కు చెందిన 16 నౌకలను అమెరికా నావికా దళం ఇప్పటికే ధ్వంసం చేసింది. ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా అమెరికా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి.



## ప్రజా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11(భారత దేశం)నిర్మల్ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై గురువారం, ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేయనున్న అవగాహన కార్యక్రమానికి సంబంధించి తగిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రణాళిక పై పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో గురువారం సర్పంచ్ లకు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలవారీగా కౌన్సిలర్లకు, మండలాల వారీగా సర్పంచ్ లకు సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాన్ని నిర్ణీత సమయానికి ప్రారంభించి, సాఫీగా కొనసాగించాలన్నారు. సరైన లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడి తెరలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వాహనాలకు తగిన పార్కింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భోజనశాలను పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే వారికి, మంచి ఆహారం ఏర్పాటు చేయాలని తెలిపారు.

## భద్రాది కొత్తగూడెం జిల్లామాల మహానాడు
## యూత్ వింగ్ అధ్యక్షుడిగా పసుపులేటి పవన్ నియామకం

* **నియామక పత్రం అందించిన జి. చెన్నయ్య- జాతీయ మాల మహానాడు అధ్యక్షులు**



భద్రాది కొత్తగూడెం జిల్లా (భారత శక్తి న్యూస్) మార్చి 11:మాల మహానాడు జాతీయ అధ్యక్షుడుజి.చెన్నయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు వాసి అయిన పసుపులేటి పావన్ ని మాల మహానాడు యూత్ వింగ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు ఈ నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో అధికారికంగా అందజేశారు, ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జిచెన్నయ్య మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాల యువతను సంఘటితం చేస్తూ, వారికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. యువతను ప్రోత్సహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాల సమాజ అభివృద్ధి కోసం ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు, మాల యువతలో చైతన్యం తీసుకువచ్చి, సమాజ బలోపేతానికి కృషి చేయాలని కూడా ఆయన తెలిపారు.ఈ నియామకం ఈ రోజు నుండి అమలులోకి వస్తుందని మరియు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమలులో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. రంజిత్ కుమార్ మంద గారు*, యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. సుధాకర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జి. రమేష్, బాలకృష్ణ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ,సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతగా కొనసాగించాలి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 11(భారత శక్తి) ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతగా కొనసాగించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, లక్ష్మణచందా మండలం పొట్టపల్లి (కె) గ్రామంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్థానికులతో కలిసి చీపురుతో పరిసరాలు శుభ్రం చేశారు. కొడవలితో పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రతిరోజు బాధ్యతగా ప్రజలంతా తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. అర్హత ఉన్న మహిళలందరూ మహిళా సంఘాల్లో చేరి, తద్వారా లభించే రుణాల వల్ల ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి వాటర్ ట్యాంక్ శుభ్రతను పరిశీలించిన వర్కర్లను అభినందించి సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

* **వాటర్ ట్యాంక్ ఎక్కి వాటర్ ట్యాంక్ శుభ్రతను పరిశీలించి వర్కర్లను అభినందించి సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 11: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా బుధవారం జిల్లా లోని సదాశివ నగర్ మండలంలో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాటర్ ట్యాంక్ ఎక్కి తనిఖీ చేసి పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడారు. సదాశివ నగర్ 1వ వార్డు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ సామర్థ్యం: 90 కే ఎల్ పనిచేసిన కార్మికులు:ఎల్లగారి భుచ్చయ్య,పోట్నగారి ప్రవీణ్ లు పరిశుభ్రత పనులను సమర్ధవంతంగా నిర్వహించిన వారిని జిల్లా కలెక్టర్ అభినందించి వారిని సన్మానించారు. గ్రామాలలో పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకుల శుభ్రతను తరచూ నిర్వహించాలని, పంచాయతీ సిబ్బంది , కార్మికులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ, చందర్, ప్రత్యేక అధికారి సతీష్, డిఎల్పీఓ శ్రీనివాస్, పంచాయతీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భాగ్యలక్ష్మి దోపిడీ?

హైదరాబాద్, మార్చి 11 (భారత శక్తి): "ముఖ్యమంత్రి చుట్టుముట్టేది పేదల ఇండ్లను కాదు.. తన మేనల్లుడి బినామీలు మింగేస్తున్న గుట్టలను చూడాలి" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ సర్కార్పై విరుచుకుపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్ ఏరియాలో 'భాగ్యలక్ష్మి మినరల్స్' పేరుతో అక్రమ మైనింగ్ సాగుతుందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీతో కలిసి అక్కడ పర్యటించిన శ్రవణ్... కొండలను పిండి చేస్తున్నారంటు మండిపడ్డారు.

పరిశీలన అనంతరం శ్రవణ్ ఏమన్నారంటే.... మానస హిల్స్లో పొంగులేటి బినామీల 'రాఘవ కన్స్ట్రక్షన్స్' అగడాలు చూసి కేజీఎఫ్ సినిమా అనుకున్నం. కానీ ఇక్కడికి వస్తే అది జస్ట్ ట్రైలర్ అని అర్థమైంది. ఇక్కడ నడుస్తున్న భాగ్యలక్ష్మి మినరల్స్ యూనిట్ సీఎం మేనల్లుడు రమేష్ రెడ్డి అనుచరులదే. పైనుంచి కింద దాకా అంతా ఆయన కనుసన్నల్లోనే నడుస్తోంది. మూడు భారీ క్రషర్లు పెట్టి రాత్రింబవళ్లు కొండలను మాయం చేస్తున్నారు. నెలకు రూ. 4 కోట్లు ఈ బినామీల జేబుల్లోకి పోతున్నయ్" అని మండిపడ్డారు.

**జీవో 111 పట్టదా?**

సామాన్యుడు గూడు కట్టుకుంటే జులుం చేసే అధికారులు, ఇక్కడ 17 ఎకరాల భూమిని నామినేషన్ కింద కట్టబెడితే ఎందుకు నోరు మెదపడం లేదు? అని శ్రవణ్ నిలదీశారు. జీవో 111 పరిధిలో ఇంత భారీ స్థాయిలో క్రషింగ్ జరుగుతున్నా.. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ అధికారులు నిద్రపోతున్నారా అని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్ర ప్రకృతి సంపదను ఏటీఎంలా వాడుకుంటూ ఢిల్లీకి కప్పం కడుతున్నారని ఘాటుగా విమర్శించారు.

**కోర్టులో తేల్చుకుంటాం..**

అక్రమ మైనింగ్ మీద సర్కార్ ఇప్పటికైనా నోరు విప్పాలని, లేకపోతే సహజ వనరుల దోపిడీపై తాము హైకోర్టును ఆశ్రయిస్తామని శ్రవణ్ హెచ్చరించారు. అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేసి, ఈ పర్యావరణ హంతకులను బోనులో నిలబెడతామని స్పష్టం చేశారు.



## మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలించిన ముద్దులచి రెడ్డి

బి.ఎన్. రెడ్డి నగర్ది, మార్చి 11 (భారత శక్తి): విజన్ పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బుధవారం పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మూర్తి, ప్రతినిధులు రామారావు, నాగయ్య, ఇంజినీరింగ్ విభాగం వర్క్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి రూ. లక్ష విరాళం

* **ఘనంగా బిజుమళ్ళ మాధవ సూర్యనారాయణ శర్మ సిద్ధాంతి స్మారక ట్రస్ట్ 16వ వార్షికోత్సవం**

వనస్థలిపురం, మార్చి 11 (భారత శక్తి): భారత శక్తి : సమాజ సేవయే పరమావధిగా గత 16 ఏళ్లుగా సాగుతున్న శ్రీ బిజుమళ్ళ మాధవ సూర్యనారాయణ శర్మ సిద్ధాంతి స్మారక సేవ భారతి ట్రస్ట్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. ట్రస్ట్ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని (మార్చి 23), 'నారాయణ సేవ' కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురంలోని 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి రూ. 1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేసింది.

**ధర్మ రక్షణే ధ్యేయం..**

2010లో స్థాపించబడిన ఈ ట్రస్ట్ "ధర్మో రక్షతి రక్షితః" అనే నినాదంతో నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కేవలం వైదిక విద్యను, గోమాత సేవను ప్రోత్సహించడమే కాకుండా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. వార్షికోత్సవ వేళ వృద్ధుల సేవకు ఈ విరాళం అందించడం సంతోషంగా ఉందన్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన ఫౌండేషన్:**

ట్రస్ట్ నుంచి అందిన ఈ భారీ విరాళం పట్ల 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వృద్ధుల అవసరాలకు, వారి సంక్షేమానికి ఈ నిధులను వెచ్చిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సమాజంపై బాధ్యతతో ముందుకు వస్తున్న ఇటువంటి ట్రస్ట్ల సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

## పేదల గూడు కూల్చేస్తారా?

* **వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాల్సిందే**
* **రంగారెడ్డి అదనపు కలెక్టర్కు తెలంగాణ జాగృతి వినతి**
* **పునరావాసం చూపకుండా కూల్చివేతలేంటి?**
* **కవిత అరెస్టును ఖండించిన నేతలు..**



రంగారెడ్డి/ఖమ్మం, మార్చి 11 (భారత శక్తి): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను అమానవీయంగా కూల్చివేయడంపై తెలంగాణ జాగృతి ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్కు జాగృతి నేతలు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాల వల్ల పేదలు రోడ్డున పడ్డారని వారు మండిపడ్డారు.

**సామాజిక న్యాయానికి గొడ్డలిపెట్టు:**

కనీస ప్రత్యామ్నాయం చూపకుండా, ఆశ్రయం కల్పించకుండా ఇళ్లను నేలమట్టం చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కె.శివశంకర్ విమర్శించారు. భూదాన్ ఉద్యమ ఆశయాలనే ప్రభుత్వం మంటగలుపుతోందని ధ్వజమెత్తారు. బాధితులకు అండగా నిలిచిన కల్వకుంట్ల కవితను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కేవలం 311 మందికి టోకన్లు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**జాగృతి ప్రధాన డిమాండ్లు ఇవే..**

* తక్షణ పునరావాసం: నిరాశ్రయులైన పేద కుటుంబాలన్నింటికీ మానవీయ కోణంలో వెంటనే ఇళ్లు/స్థలాలు కేటాయించాలి.
* నిరంకుశత్వం వద్దు: అధికారుల ఇష్టారాజ్యంగా కాకుండా, బాధితులతో చర్చించి క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా సమస్యను పరిష్కరించాలి.
* కేసులు ఎత్తివేయాలి: న్యాయం కోసం శాంతియుతంగా పోరాడుతున్న వారిపై పెట్టిన అక్రమ కేసులు, వేధింపులను తక్షణమే నిలిపివేయాలి.

ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు రయకంటి జగన్, అన్నబోయిన శ్రీశైలం, విజయ భార్గవ రెడ్డి, సిహెచ్. వీరేష్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య 'పడగనీడ'లో కార్మికుల బతుకులు!

* **క్షేత్రస్థాయి వాస్తవాలపై సర్కారుకు అవగాహన శూన్యం.**
* **పీఎఫ్, ఈఎస్ఐ ఊసే లేదు.. రక్షణ కవచాల్లేక రోగాల పాలు..**
* **సీఎం రేవంత్ తీరుపై సబితా ఇంద్రారెడ్డి నిప్పులు.. 'భారత శక్తి' ప్రత్యేక కథనం**



హైదరాబాద్/మహేశ్వరం: భారత శక్తి : నగరం నిద్రలేవక ముందే రోడ్ల మీదకు వచ్చి.. మన మురికిని మోసే పారిశుద్ధ్య కార్మికుల బతుకులు ఇప్పుడు 'మురికికూపం'లో కూరుకుపోతున్నాయి. అటు ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు లేక, ఇటు అందాల్సిన సామాజిక భద్రత అందక వారు అల్లాడుతున్నారు. మున్సిపల్ శాఖపై, క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్మికుల దయనీయ స్థితిగతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస అవగాహన లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మీర్పేట్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులతో భేటీ అయిన ఆమె, వారి సమస్యలను విన్నప్పుడు వెలుగులోకి వచ్చిన వాస్తవాలు విస్మయానికి గురిచేస్తున్నాయి.

**నిధుల మళ్లింపు.. పీఎఫ్ గల్లంతు!**

పారిశుద్ధ్య కార్మికుల వేతనం నుంచి కట్ అవుతున్న ప్రావిడెంట్ ఫండ్ (PF) గత రెండేళ్లుగా వారి ఖాతాల్లో జమ కావడం లేదు. ఇది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం కార్మికుల హక్కుల ఉల్లంఘన. "చమటోడ్చి పనిచేస్తున్న మా డబ్బులే మాకు అందడం లేదు. రేపు మాకేదైనా అయితే మా కుటుంబాల పరిస్థితి ఏంటి?" అని మీర్పేట్ కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు.

* **గాలికి వదిలేసిన 'సేఫ్టీ'.. మృత్యువుతో పోరాటం:**

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) మార్గదర్శకాల ప్రకారం, ప్రమాదకర వ్యర్థాలతో పనిచేసే వారికి కనీసం గ్లౌజులు, మాస్కులు, గమ్ బూట్లు, మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు అందించాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

కెమికల్ ఎక్స్పోజర్: మురుగు నీరు, కుళ్ళిన వ్యర్థాల నుంచి వెలువడే మీథేన్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి వాయువుల వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయి.

గాయాల ముప్పు: గాజు ముక్కలు, సిరంజీలు, పదునైన లోహపు వ్యర్థాల వల్ల సెప్టిక్ (Sepsis) అయ్యే ప్రమాదం ఉన్నా, ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో లేవు.

బీమా లేని బతుకు: కోవిడ్ కాలంలో 'ఫ్రంట్ లైన్ వారియర్స్' అని పొగిడిన సర్కారు, ఇప్పుడు వారికి కనీస ఆరోగ్య బీమా (Health Insurance) కూడా కల్పించడం లేదని సబితా రెడ్డి విమర్శించారు.

* **కేసీఆర్ హయాం వెర్సస్ నేటి దుస్థితి:**

గత ప్రభుత్వంలో పారిశుద్ధ్య రంగాన్ని వ్యవస్థీకృతం చేశామని సబితా రెడ్డి గుర్తు చేశారు.

* మెకనైజేషన్: సుమారు 4 వేల స్వచ్ఛ ఆటోలను ప్రవేశపెట్టి చెత్త సేకరణను సులభతరం చేయడం.
* వేతనాల పెంపు: సంవత్సరానికి రెండుసార్లు వేతనాలు పెంచుతూ కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడటం.
* గుర్తింపు: పారిశుద్ధ్య కార్మికులను 'సఫాయి కార్మికులు'గా కాకుండా 'సేవకులు'గా గౌరవించిన తీరును ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

* **శాస్త్రీయ విశ్లేషణ: విస్మరిస్తే వినాశనమే!**

* పారిశుద్ధ్య నిర్వహణ అనేది కేవలం ఊడ్చడం మాత్రమే కాదు, అది ఒక శాస్త్రీయ ప్రక్రియ.
* BioAerosols: చెత్తను ఊడ్చేటప్పుడు గాలిలోకి చేరే సూక్ష్మక్రిములు కార్మికుల నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి.
* Ergonomics: నిరంతరం వంగి పనిచేయడం వల్ల 80% కార్మికులు వెన్నునొప్పి, కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారు.

వీటిని పరిష్కరించడానికి పారిశుద్ధ్య రంగంలో 'యంత్రీకరణ' (Mechanization) పెంచాలని, కానీ దాన్ని నడిపే కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**డిమాండ్లు ఇవే..**

ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

వెంటనే పెండింగ్లో ఉన్న పీఎఫ్ బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలి.

* అందరికీ ఉచిత ఆరోగ్య బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.
* ప్రతి మూడు నెలలకోసారి కార్మికులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
* ఆధునిక రక్షణ పరికరాలను (PPE Kits) పంపిణీ చేయాలి.

ప్రజా సమస్యలను గాలికొదిలేసి కాలక్షేపం చేస్తే రాబోయే రోజుల్లో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.

## గండం గట్టేక్కినట్టేనా?

హైదరాబాద్, మార్చి 11 (భారత శక్తి):తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా అత్యంత ఉత్కంఠ రేపుతున్న 'పార్టీ ఫిరాయింపుల' అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక ఘట్టానికి చేరుకుంది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం సంచలన తీర్పును వెలువరించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. వీరిద్దరూ పార్టీ మారినట్లు చెప్పడానికి తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని స్పీకర్ స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రంలో చర్చనీయాంశమైన మొత్తం పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ ప్రక్రియకు స్పీకర్ తెరదించినట్లయింది.

**సాక్ష్యాల లేమితోనే?**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు తదుపరి కాలంలో కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారంటూ ప్రతిపక్ష పార్టీలు స్పీకర్ కార్యాలయంలో అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా దానం నాగేందర్, కడియం శ్రీహరిల కేసులను విచారించిన స్పీకర్, పిటిషనర్లు సమర్పించిన ఆధారాలు చట్టపరంగా నిలబడేలా లేవని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, దానం నాగేందర్ ఎంపీగా పోటీ చేసినా, లేదంటే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా, అది పార్టీ మారినట్లుగా పరిగణించలేమని స్పీకర్ కార్యాలయం భావించినట్లు తెలుస్తోంది. పార్టీ విప్ జారీ చేయకపోవడం, క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను కూడా స్పీకర్ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.

**సుప్రీంకోర్టు గడువు లోపే..**

ఈ ఫిరాయింపుల అంశంపై దాఖలైన పిటిషన్లను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు గతంలోనే స్పీకర్ను ఆదేశించింది. మార్చి 12న సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు రానున్న నేపథ్యంలో, అంతకంటే ఒకరోజు ముందే స్పీకర్ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

**ప్రజాస్వామ్యానికి చీకటి రోజు: కేటీఆర్**

స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బీఫామ్ మీద ఎన్నికల్లో పోటీ చేసిన వారికి కూడా క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని, రాజ్యాంగ వ్యవస్థలను అధికార పక్షానికి అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నట్లు సంకేతాలిచ్చారు.

**వ్యక్తిగత హక్కుగా దానం నాగేందర్..**

తనపై అనర్హత వేటు పడకుండా క్లీన్ చిట్ రావడంపై దానం నాగేందర్ హర్షం వ్యక్తం చేశారు. తాను ఏ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని, తనపై అనర్హత పిటిషన్ వేసే అధికారం పిటిషనర్లకు లేదని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలలుగా ఈ కేసు విషయంలో తాను మానసిక క్షోభ అనుభవించానని, ఎట్టకేలకు న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు.

**ముగిసిన పదిమంది కేసుల అధ్యాయం..**

ఈ తాజా నిర్ణయంతో, గత ఏడాది కాలంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ నుంచి క్లీన్ చిట్ లభించినట్లయింది. అయితే, స్పీకర్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు కోర్టులో ఎలా సవాలు చేస్తాయి? సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని ఏ విధంగా చూస్తుంది? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నానో యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా, మార్చి 11 (భారత శక్తి): ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సదాశివ నగర్ మండలంలోని వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నానో యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పంటలలో నానో యూరియాను డ్రోన్ సహాయంతో పిచికారీ చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు వేయవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు నానో యూరియా ప్రయోజనాలు, డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానం గురించి వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.